బుధవారం
21-06-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 359
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఆధునిక సోషలిస్టు చైనాయే లక్ష్యం

ఆధునిక సోషలిస్టు చైనా లక్ష్యసాధనకు దేశ యువత పునరంకితం కావాలని వక్తలు పిలుపునిచ్చారు. కమ్యూనిస్ట్ యూత్ లీగ్ ఆఫ్ చైనా (సీవైఎల్‌సీ) 19వ జాతీయ మహాసభ రాజధాని బీజింగ్‌లోని గ్రేట్ హాల్ ఆఫ్ ది పీపుల్‌లో జరిగింది. ప్రారంభ సభలో చైనా కమ్యూనిస్టు పార్టీ (సీపీసీ) అగ్ర నాయకులు జిన్‌పింగ్, జావో లెజి, వాంగ్ హునింగ్, డింగ్, లి తదితరులు పాల్గొన్నారు.

2లో

అప్పుల్లో ఏపీ రికార్డు

77 రోజుల్లో రూ.20,500 కోట్ల రుణ సేకరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ప్రతి మంగళవారాన్ని అప్పుల వారంగా మార్చిన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా సెక్యూరిటీ బాండ్ల వేలం ద్వారా రిజర్వ్ బ్యాంక్‌లో వెయ్యి కోట్లు అప్పు తీసుకుంది.

వీటిలో రూ.500 కోట్లకు 17 సంవత్సరాల్లో చెల్లింపులు చేసేలా 7.35 శాతం వడ్డీతో రుణం తీసుకురాగా, మరో రూ.500 కోట్లు 9 సంవత్సరాలకు 7.40 శాతం వడ్డీతో అప్పు తీసుకొచ్చింది. ఈ అప్పుతో కేవలం 77 రోజుల వ్యవధిలో రూ.20,500 కోట్లు తీసుకొచ్చిన రాష్ట్రంగా ఏపీ రికార్డుల్లోకి ఎక్కింది. ఈ ఏడాది ఎఫ్ఆర్‌బీఎం కింద రూ.30,500 కోట్ల అప్పు కోసం అనుమతించింది. వీటిలో డిసెంబరు నెల వరకు తీసుకోవల్సిన రుణంలో ఇక 10 వేల కోట్లే మిగిలి ఉన్నాయి. 2014-15 రెవెన్యూ లోటు కింద ప్రత్యేక సాధారణ ఆర్థిక సాయంగా గతంలో ఎన్నడూలేని విధంగా అనూహ్యంగా ఒకేసారి కేంద్ర ప్రభుత్వం గత వారం రూ.10,461 కోట్లు విడుదల చేసింది. దీంతో ఇప్పటివరకు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వానికి భారీ ఊరట లభించింది. అయినప్పటికీ మంగళవారం అప్పు చేసే కార్యక్రమాన్ని మాత్రం ప్రభుత్వం కొనసాగిస్తోంది.

బోగస్ ఓట్ల కలకలం

అధికార పక్ష వ్యవహార శైలిపై ప్రతిపక్షాలు తీవ్రంగా ధ్వజమెత్తుతున్నాయి. బోగస్ ఓట్ల వ్యవహారంపై జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారికి పెద్దఎత్తున ఫిర్యాదు చేస్తున్నాయి. ఏడాదిలోగా ఎన్నికలు సమీపిస్తుండటంతో అధికార పార్టీ కనుసన్నల్లోనే ఇవి జరిగినట్లు ప్రచారం ఉంది.

- 10 లక్షలు నమోదు?
- విచ్చలవిడిగా తొలగింపు
- అడ్డగోలుగా బూత్‌లకు బదిలీ
- రాజకీయ కుట్రకు తెర
- ప్రతిపక్ష పార్టీల ఆగ్రహం
- విజయవాడ, విశాఖ, అనంతలో అక్రమాలు
- ఎన్నికల అధికారులకు ఫిర్యాదుల వెల్లువ
- ఇద్దరిపై వేటు వేసిన యంత్రాంగం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఓటర్ల జాబితా ప్రక్రియలో భారీగా బోగస్ ఓట్ల నమోదు విమర్శలు కలకలం రేపుతున్నాయి. ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగినట్లు తెలుస్తోంది. ఇద్దరు సిబ్బందిపై ఎన్నికల ఉన్నతాధికారి వేటు వేయడం దీనికి మరింత బలం చేకూరుతోంది. ప్రతిపక్ష పార్టీలు బలంగా ఉన్న నియోజకవర్గాల్లో భారీగా ఓటర్ల తొలగింపు, దొంగ ఓట్ల నమోదు లాంటి చర్యలకు ఉపక్రమించినట్లు ఆరోపణలున్నాయి. అధికార పక్ష వ్యవహార శైలిపై ప్రతిపక్షాలు తీవ్రంగా ధ్వజమెత్తుతున్నాయి. బోగస్ ఓట్ల వ్యవహారంపై జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారికి పెద్దఎత్తున ఫిర్యాదు చేస్తున్నాయి. ఏడాదిలోగా ఎన్నికలు సమీపిస్తుండటంతో అధికార పార్టీ కనుసన్నల్లోనే ఇవి జరిగినట్లు ప్రచారం ఉంది. విశాఖపట్నం, అనంతపురం, విజయవాడ, మచిలీపట్నం తదితర ప్రాంతాల్లో ఓటర్ల జాబితా ప్రక్రియ వివాదాస్పదంగా మారింది. వేర్వేరు వార్డుల్లో, వేర్వేరు డోర్ నంబర్లు ఉన్న విధానం చాలా అనుమానాలకు తావిస్తోంది. వలస ఓటర్లకు పెద్దఎత్తున జాబితాలో స్థానం కల్పించినట్లు విమర్శలు ఉన్నాయి. దీనిపై మచిలీపట్నానికి చెందిన దిలీప్ అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. అన్ని నియోజవర్గాల్లో కలిపి దాదాపు 10 లక్షల దొంగ ఓటర్లు నమోదయినట్లు సమాచారం. చాలా నియోజకవర్గాల్లో దొంగ ఓటర్లతో పాటు ఇతర నియోజకవర్గాల నుంచి వచ్చిన వారికి చోటు కల్పించినట్లు ప్రతిపక్ష పార్టీల నేతలు మండిపడుతున్నారు. విశాఖపట్నంలోని తూర్పు నియోజకవర్గంలో 40 వేల ఓట్లు గల్లంతైనట్లు అక్కడి టీడీపీ, బీజేపీ నేతలు పేర్కొంటున్నారు. ఇక్కడ ఒకే చిరునామాపై ఎక్కువ మంది ఓటర్లు నమోదయిన సంఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఇష్టానుసారంగా ఓటర్లను ఒక బూత్ నుంచి మరో బూత్‌లోకి మార్చేశారని, ప్రతి బూత్‌లోనూ వందలాది మంది పేర్లు తొలగించినట్లు తెలుస్తోందని, ఇది రాజకీయ

- మిగతా 2 లో

ప్రజలే గద్దె దించుతారు

2024లో మోదీ ప్రభుత్వానికి ఓటమి తప్పదు : డి.రాజా

రాజాను కలిసిన జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్

రాంచీ: కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి 2024లో ఓటమి తప్పదని, నియంత పరిపాలనకు ప్రజలే చరమగీతం పాడతారని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. దేశంలో మత ఘర్షణలు సృష్టిస్తూ సమాజాన్ని విభజించే ప్రయత్నాలను తిప్పికొడతారన్నారు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం కారణంగా ప్రజలు నిస్సహాయ పరిస్థితుల్లో జీవించేలా మోదీ ప్రభుత్వం చేసిందని విమర్శించారు. ఇలాంటి తరుణంలో ప్రతిపక్షాలు ఏకం కావాలని నొక్కిచెప్పారు. జార్ఖండ్‌లో రెండు రోజుల రాష్ట్ర సమితి సమావేశం ముగియగా రామ్‌ఘర్‌లో వర్కర్ల సదస్సు జరిగింది. అనంతరం రాంచీలోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. డి.రాజా మాట్లాడుతూ 'దేశంలో నియంత పాలన సాగుతోంది. ఈడీ, సీబీఐ ద్వారా ప్రతిపక్ష పార్టీల నాయకులను బెదిరిస్తున్నారు. మహిళా రెజ్లర్లకు ఏం జరిగిందో అందరికీ తెలుసు. రాష్ట్రపతిని పక్కకుపెట్టి ఏ విధంగా పార్లమెంటు భవనాన్ని ప్రారంభించారో మొత్తం ప్రపంచం చూసింది. తొమ్మిదేళ్ల సుపరిపాలన అందించినట్లు మోదీ ప్రభుత్వం ఊదరగొడుతూనే తమ విజయాలను లెక్క పెట్టుకుంటోంది. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ, లాక్‌డౌన్, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, కోవిడ్ కాలంలో నిస్సహాయత వంటివి ప్రభుత్వ విజయాల ఖాతాలో ఉన్నాయి. 2024లో ప్రజలే మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటేస్తారు' అని రాజా అన్నారు. బీజేపీని ఓడించేందుకు లౌకిక, ప్రజాస్వామ్య పార్టీలు ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు. జార్ఖండ్ రాష్ట్ర అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో యూపీఏతో కలిసి పోటీ చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. 20-22 స్థానాల్లో, ఏడు

- మిగతా 2 లో

'తీగ లాగితే డొంక కదులుతుంది'

విశాఖలో ఎంపీ భార్య, కుమారుడి అపహరణపై అమిత్‌షాకు నారాయణ లేఖ

కేంద్ర సంస్థలతో సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్

8లో

రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పని చేస్తోందా ?

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
- దాడులపై రేపు విజయవాడలో రౌండ్‌టేబుల్

విశాలాంధ్ర - పత్తికొండ: జగన్మోహన్ రెడ్డి పాలనలో దాడులు, దౌర్జన్యాలు, దోపిడీలు పెట్రేగిపోతున్నాయని, అసలు రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పని చేస్తోందా అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రశ్నించారు. కర్నూలు జిల్లా పత్తికొండలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో అక్కని వేధించవద్దన్నందుకు బాలుడు అమర్‌నాథ్‌ని పెట్రోల్‌పోసి సజీవదహనం చేసిన ఘటన బాధాకరమని, రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ ఇలాంటి ఘటన

- మిగతా 2 లో

స్వామీజీల అకృత్యం

భక్తి ముసుగులో అఘాయిత్యాలు

పూర్ణానంద సరస్వతిపై కఠిన చర్యలు

బాలల హక్కుల కమిషన్, మహిళా సంఘాల డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: స్వామీజీల ఆకృత్యాలు అధికమైపోయాయి. పేదరికం, మూఢనమ్మకాలను ఆసరాగా చేసుకుని కొంతమంది స్వామీజీలు భక్తి ముసుగులో అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. ఈ మధ్య దొంగ స్వామీజీల రాసలీలలు అధికమయ్యాయి. స్వామీజీల ముసుగులో వారు వెనక నడిపించే బాగోతాలు ఒక్కొక్కటి బయటపడుతున్నాయి. తాజాగా విశాఖలో ఓ స్వామీజీ రెండెళ్ల పాటు ఓ బాలికను అత్యాచారం చేయడం కలకలం రేపుతోంది. బాలల హక్కుల కమిషన్, మహిళా సంఘాలు పెద్ద ఎత్తున ఆగ్రహం

- మిగతా 2 లో

హమ్మయ్య చల్లబడింది

ఒక్కసారిగా మారిన వాతావరణం

- విజయవాడతో సహ అనేక ప్రాంతాల్లో వర్షాలు
- రుతుపవనాలు శరవేగంగా విస్తరణ
- ఎండ తీవ్రత నుంచి ఉపశమనం

2లో

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

3లో

ఇదీ లోకం!

సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం అధ్వర్యంలో

బీమోలులో దుక్కి దున్నిన పట్టాదారులు

వందఎకరాల్లో ఎర్ర జెండాలు పాతిన సీపీఐ

తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం బీమోలు గ్రామంలో 350 ఎకరాల పట్టాదారుల భూములను ఆక్రమించిన సాగుదారులను చెదర గొట్టి సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం అధ్వర్యంలో పట్టాదారులు మంగళవారం ఎర్ర జెండాలు చేత బూని రెండు ట్రాక్టర్లతో దుక్కిదున్ని ఆకుమడులను ప్రారంభించారు .

2లో

ప్రభుత్వ పాఠశాలల్లో

అంతర్జాతీయ సిలబస్

అదేస్థాయి పరీక్షా విధానం అమలు

మట్టి నుంచి మహావృక్షాలుగా పేదింటి పిల్లలు

ప్రభుత్వ పాఠశాలలతో ప్రైవేటు వారే పోటీపడేలా తీర్చిదిద్దుతాం

జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో సీఎం జగన్

2లో

శరణార్థుల సంక్షేమానికి
మరింతగా పాటుపడదాం
133 దేశాల్లోని సభ్యులకు డబ్ల్యూఎఫ్‌టీయూ పిలుపు

జెనీవా: శరణార్థుల సంక్షేమానికి మరింతగా పాటుపడదామని సభ్యదేశాలకు ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య పిలుపునిచ్చింది. ప్రపంచవ్యాప్తంగా శరణార్థులకు అనుకూలమైన జీవన పరిస్థితులు కల్పించేందుకు చేస్తున్న పోరాటాలను ప్రతి రంగం, ప్రాంతంలో మరింత బలంగా కొనసాగించాలని సూచించింది. శరణార్థుల సమాజంలో భాగమయ్యేలా సాగే ప్రక్రియ సజావుగా ఉండేలా చూడాలని ప్రపంచ శరణార్థుల దినోత్సవం సందర్భంగా ఐదు ఖండాల్లోని 133 దేశాల్లోగల 108 మిలియన్ల మంది సభ్యులకు ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌టీయూ) పిలుపునిచ్చింది. సామ్రాజ్యవాద దూకుడు, మార్కెట్లు, సహజ వనరులు, ఇంధన మార్గాల దోపిడీ, కేపిటలిస్టుల దాష్టీకాలు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు, ఆకలి, పేదరికం, ఆధునిక బానిసత్వం వంటివి కోట్లాది మందికి నిలువ నీడ లేకుండా చేస్తున్నాయని, అనివార్య పరిస్థితుల్లో ప్రజలను ప్రత్యక్షంగా, పరోక్షంగా శరణార్థులుగా మారుతున్నారని డబ్ల్యూఎఫ్‌టీయూ పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా 10.8కోట్ల మంది దిక్కుతోచని స్థితిలో స్వస్థలాలను వీడినట్లు యూఎన్‌హెచ్‌సీఆర్ డేటా చెబుతోంది. సమాజంలో అత్యంత బలహీన వర్గంగా శరణార్థులు ఉన్నారని, వారు తమ స్వస్థలాలను వదిలి కొత్త దేశాలకు తరలిపోతూ అమానవనీయ పరిస్థితుల్లో జీవిస్తారని, అభద్రతా భావానికి లోనవుతూ కనీస అవసరాలకూ నోచుకోవడం లేదని సమాఖ్య ఆందోళన వ్యక్తంచేసింది. నిరాశ్రయులను కేపిటలిస్ట్ ఉత్పత్తి కోసం 'రిజర్వ్ ఆర్మీ'గా వాడుతున్నారని తెలిపింది. ఉత్పత్తి పెంచాలని కేపిటలిస్టులు భావించిన ప్రతిసారి ఈ శరణార్థులు, వలసదారులు చవక లేబర్‌గా మారుతూ దీన పరిస్థితుల్లో అరకొర వేతనాలకు పనిచేస్తున్నా పొట్టనిండని పరిస్థితి దయనీమయని డబ్ల్యూఎఫ్‌టీయూ వెల్లడించింది. అల్లర్లు, ఘర్షణలు, సహజ విపత్తులు, వాతావరణంలో మార్పు, ఆర్థిక కష్టాలు తదితరాల కారణంగా వలసలు ఏటేటా పెరుగుతున్నాయని, ఇంటర్నల్ డిస్‌ప్లేస్‌మెంట్ మానిటరింగ్ సెంటర్ ప్రకారం 62. మిలియన్ల మంది అంతర్గత వలసదారులు ఉన్నట్లు తెలుస్తోందని ప్రకటన పేర్కొంది. శరణార్థులపై దాడులు పెరుగుతున్నాయని, క్లిష్టమైన ఆంక్షలు, ఆర్థిక షరతులకు వారు కట్టుబడాలని, ఇటీవల మధ్యదరా సముద్రంలో పడవ బోల్తా పడి 750 మంది శరణార్థులు చనిపోయిన ఘటనపై అనేక మంది మొసలి కన్నీళ్లు కార్చారని, యూరోపియన్ నేతలు కూడా రెండు కన్నీటి బొట్లు రాల్చారే తప్ప సైనిక ఘర్షణలకు నిధులను ఆపలేదని, శరణార్థి దేశంపై ఆంక్షలు పెంచుతున్నారని డబ్ల్యూఎఫ్‌టీయూ పేర్కొంది. శరణార్థులకు గౌరవప్రద స్వాగతం లభించేందుకు, శరణాలయాల్లో ఆహారం, ఆరోగ్య సంరక్షణతో పాటు వారి పిల్లలకు విద్య అందేలా పోరాడుతున్నట్లు వెల్లడించింది. శరణార్థుల రక్షణ దేశాల బాధ్యతని, దానిని ఎన్జీవోలపై రుద్దడం సరికాదని డబ్ల్యూఎఫ్‌టీయూ నొక్కిచెప్పింది. గమ్యస్థానాలైన దేశాలకు వలసదారులు చేరుకునేందుకు భద్రత పెంచాలని, ఆ పద్ధతులను సరళీకరించాలని డిమాండ్ చేసింది. శరణార్థులకు పౌర హక్కులు, గౌరవ వేతనాలు, అనుకూల పని, జీవన పరిస్థితులు, రక్షణ కోసం పోరాటాలు మరింత ఉధృతంగా సాగిస్తామని ప్రకటనలో డబ్ల్యూఎఫ్‌టీయూ తెలిపింది.

తమ భవిష్యత్‌ను క్యూబన్లు నిర్ణయంచుకోగలరు : కేకేఈ

ఏథెన్స్: విదేశీ జోక్యం లేకుండా తమ భవిష్యత్‌ను నిర్ణయించుకునే హక్కు క్యూబా ప్రజలకు ఉందని గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) నొక్కిచెప్పింది. స్ట్రాస్‌బర్గ్‌లోని యూరోపియన్ పార్లమెంటులో జరిగిన ప్లీనరీ సమావేశంలో క్యూబా, యూరోపియన్ యూనియన్ మధ్య రాజకీయ చర్చలు, సహకార ఒప్పందంపై చర్చల సందర్భంగా కేకేఈ ఎంఈపీలు ఈ మేరకు వ్యాఖ్యానించారు. కేకేఈ ఎంఈపీ నికాలోస్ అవనానోస్ మాట్లాడుతూ 'ఉచిత విద్య, కార్మికుల సంరక్షణ కోసం కీలక హక్కుల సాధనలో క్యూబా ఆదర్శం. తమ బడ్జెట్‌లో 24శాతాన్ని పూర్తిగా ప్రజారోగ్య సంరక్షణ కోసం వెచ్చిస్తుంది. కొవిడ్ మహమ్మారి వేళ ప్రపంచానికి వైద్య సేవలను క్యూబా అందించగలిగింది. అమెరికా మాత్రం 1962 నుంచి ఆంక్షలు కొనసాగిస్తోంది. 245 అనుచిత చర్యల వల్ల 140 బిలియన్ డాలర్ల నష్టం వచ్చింది. యూరోపియక్ కేపిటల్ ప్రయోజనాల ఉద్దేశంతో ఈయూ ఆంక్షలు విధిస్తుంది. క్యూబా ప్రజల విజయాలను తక్కువగా ఈయూ చూపాలని సంకల్పించింది.

క్యూబా ప్రజల అవసరాలు, హక్కుల గురించి చిత్తశుద్ధి ఉన్నవారు తక్షణమే ఆంక్షలు ఎత్తివేయాలని అమెరికాను డిమాండ్ చేయాలి. క్యూబా ప్రజలకు కనీస సేవలను, వస్తువులను నిరాకరించడం అన్యాయం. విదేశీ జోక్యం లేకుండా తమ భవిష్యత్‌ను నిర్ణయించుకునే హక్కు క్యూబా ప్రజలకు కచ్చితంగా ఉంటుంది' అని నొక్కిచెప్పారు.

ఆధునిక సోషలిస్టు చైనాయే లక్ష్యం
సీవైఎల్‌సీ 19వ జాతీయ మహాసభలో వక్తలు

బీజింగ్: ఆధునిక సోషలిస్టు చైనా లక్ష్యసాధనకు దేశ యువత పునరంకితం కావాలని వక్తలు పిలుపునిచ్చారు. కమ్యూనిస్ట్ యూత్ లీగ్ ఆఫ్ చైనా (సీవైఎల్‌సీ) 19వ జాతీయ మహాసభ రాజధాని బీజింగ్‌లోని గ్రేట్ హాల్ ఆఫ్ ది పీపుల్‌లో జరిగింది. ప్రారంభ సభలో చైనా కమ్యూనిస్టు పార్టీ (సీపీసీ) అగ్ర నాయకులు జిన్‌పింగ్, జావో లెజి, వాంగ్ హునింగ్, దింగ్, లి తదితరులు పాల్గొన్నారు. 73 మిలియన్లకుపైగా ఉన్న సీవైఎల్‌సీ సభ్యుల తరపున దేశ నలుమూలల నుంచి 1500 మంది ప్రతినిధులు మహాసభకు హాజరయ్యారు. సీపీసీ కేంద్ర కమిటీ తరపున కాయి క్వీ మాట్లాడుతూ సీపీసీ కేంద్ర కమిటీ శక్తిమంతమైన నాయకత్వంలో సోషలిజం దిశగా మరింత పటిష్ఠంగా ముందుకు వెళ్లాలని అన్నారు. సీవైఎల్‌సీ మరింత బలపడిందని, రాజకీయ స్పృహను పెంచుకోవడమే కాకుండా ప్రజలకు ప్రాతినిధ్యం వహించేలా సామర్థ్యాన్ని పెంచుకోగలిగిందని కొనియాడారు. అత్యున్నత ఆధునిక సోషలిస్టు దేశంగా చైనా నిర్మాణ లక్ష్య సాధనకు అన్ని వర్గాలు కృషిచేస్తున్నట్లు తెలిపారు. సిద్ధాంతాలు, బాధ్యత, నిబద్ధతతో కూడిన గొప్ప యువశకం కోసం దేశ యువత కృషిచేయాలని పిలుపునిచ్చారు. దేశ యువను ఏకం చేయాలని, కొత్త ప్రయాణంలో వారికి నాయకత్వం వహించాలని, కొత్త శకాన్ని మరింత అత్యున్నతమైనదిగా తీర్చిదిద్దాలని సీవైఎల్‌సీకి సూచించారు.

ప్రజలే గద్దె దించుతారు
(మొదటిపేజీ తరువాయి)

లోక్‌సభ స్థానాల్లో సీపీఐకి పట్టు ఉందని చెప్పారు. ఈ స్థానాలు సర్దుబాటు చర్చల్లో భాగమని రాజా అన్నారు. జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ రాంచీలో రాజాతో భేటీ అయి అనేక అంశాలపై చర్చించారు. సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజాను కలిశాను. చాలా అంశాలపై చర్చించుకున్నాం. భువనేశ్వర్ ప్రసాద్ మెహతా తదితరులు సమావేశంలో పాల్గొన్నారు' అని సోరెన్ ట్వీట్ చేశారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఈ మధ్యనే రాజాను కలిసి కేంద్ర ఆర్డినెన్స్‌పై పోరాటానికి మద్దతు కోరారు. సీపీఐ తరపున పూర్తి మద్దతిస్తామని కేజ్రీవాల్‌కు రాజా హామీనిచ్చారు.

బోగస్ ఓట్ల కలకలం
(మొదటిపేజీ తరువాయి)

కుట్రలో భాగమేనని ఆ పార్టీలు ధ్వజమెత్తుతున్నాయి. మరోవైపు, ఇటీవల కాలం నుంచి ఓటర్ల జాబితాపై వస్తున్న ఆరోపణలు, అవకతవకలపై రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన దృష్టి సారించింది. ఉరవకొండకు సంబంధించిన ఇద్దరు బూత్ స్థాయి అధికారుల (బీఎల్‌వో) లపై చర్యలు తీసుకున్నారు. విశాఖపట్నం, గుంటూరు, విజయవాడ తదితర ప్రాంతాలకు సంబంధించిన నివేదికలు అందిన వెంటనే, అక్కడి బీఎల్‌వోలపైనా చర్యలకు రంగం సిద్ధం చేస్తున్నారు.

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు కార్యాచరణ

వచ్చే ఏడాది రాష్ట్రంలో లోక్‌సభ, శాసనసభ స్థానాలకు జరిగే ఎన్నికలకు అవసరమైన తుది ఓటర్ల జాబితాను రూపొందించేందుకు ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యాచరణ ప్రణాళికను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ప్రకటించిన విషయం విదితమే. పోలింగ్ సిబ్బందికి ఈనెల 1వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభమై జులై 20 వరకు కొనసాగుతుంది. అక్టోబరు 17న సమగ్ర ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ, 17 నుంచి నవంబరు 30 వరకూ క్లైమ్‌లు, అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఇందుకోసం బూత్ స్థాయిలో క్యాంపులు నిర్వహిస్తారు. ఈ ఏడాది డిసెంబరు 26 నాటికి క్లైమ్‌లు, అభ్యంతరాలను పరిష్కరిస్తారు. వచ్చే ఏడాది జనవరి 1 కల్లా తుది జాబితా ప్రచురణకు కమిషన్ అనుమతి పొందుతుంది. జనవరి 5న తుది ఓటర్ల జాబితాను ప్రచురించేందుకు రాష్ట్ర ఎన్నికల యంత్రాంగం నిమగ్నమైంది. ఇందుకోసం ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అధ్వర్యంలో చర్యలు ప్రారంభించారు. ఈలోగానే బోగస్ ఓట్లు నమోదయిన ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదులపై అధికారులు సమగ్ర దర్యాప్తు చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, అన్ని పార్టీలతో ఎన్నికల సమావేశం నిర్వహించాలని ప్రతిపక్ష పార్టీలు కోరుతున్నాయి.

తగ్గిన యువ ఓటర్లు

రాష్ట్రంలో యువ ఓటర్లు తగ్గిపోతున్నారు. 18-19 సంవత్సరాల యువ ఓటర్లలో జనాభా శాతం ప్రకారం 12 లక్షల యువ ఓటర్లు ఉండాల్సి ఉండగా, కేవలం 3.50 లక్షల యువ ఓటర్లే ఉండటం గమనార్హం. ఈ వ్యత్యాసాన్ని పూరించే బాధ్యత ఎన్నికల సంఘంతో పాటు అన్ని రాజకీయ పక్షలూ సహకరించాలి. ఎన్నికల్లో యువ ఓటర్లు ఇచ్చే తీర్పు కీలకంగా నిలుస్తుంది. అలాంటి యువత ఓటర్ల నమోదులో వెనుకబాటుకు గురవ్వడం దురదృష్టకరం. వచ్చే ఏడాది జనవరి 1 కల్లా 18 సంవత్సరాలు నిండే యువత ఓటర్లుగా తమ పేరును నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. దీనిని అర్హతగల యువ ఓటర్లంతా ఓటర్ల జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాల్సిన అవసరం ఉంది.

సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం అధ్వర్యంలో
బీమోలులో దుక్కి దున్నిన పట్టాదారులు

విశాలాంధ్ర-దేవరపల్లి/గోపాలపురం: తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం బిమోలు గ్రామంలో 350 ఎకరాల పట్టాదారుల భూములను ఆక్రమించిన సాగుదారులను చెదర గొట్టి సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం అధ్వర్యంలో పట్టాదారులు మంగళవారం ఎర్ర జెండాలు చేత బూని రెండు ట్రాక్టర్లతో దుక్కిదున్ని ఆకుమడులను ప్రారంభించారు ఈ సందర్భగా సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ బిమోలు భూ పోరాట చరిత్ర 40 ఏళ్లుగా కొనసాగుతోందని చెప్పారు. 40 ఏళ్ల క్రితం సీపీఐ పోరాటం చేసి బిమోలు దళిత వర్గాలకు పట్టాలు ఇప్పించిందన్నారు. పాలకులు రెవెన్యూ అధికారులు అలసత్వం కారణంగా కౌలుదారులను సృష్టించి కోర్టులు పేరుతొ భూమలను పట్టాదారులకు అందచేయకుండా కుట్ర చేస్తున్నారని చెప్పారు. అందుకునే ఈ రోజు 100 ఎకరాలను సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యం లో ఎర్రజెండాలు పాతి దుక్కుదున్నుతున్నామని మధు చెప్పారు. ఈ భూ పోరాటం ఆగదని స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కుంద్రపు రాంబాబు, కార్యవర్గ సభ్యులు వి కొండలరావు, ఏ సత్యనారాయణ, కె జ్యోతి రాజు , సీహెచ్ సునీల్ , వ్యవసాయ కార్మిక

నాయకులు కోవడయ్య ,సీపీఐ నాయకులు వెంకటరావు , రమేష్ , మంగాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పని చేస్తోందా ?
(మొదటిపేజీ తరువాయి)

జరగలేదన్నారు. విశాఖలో ఎంపీ భార్య, కొడుకును కిడ్నాప్ చేసి బంధించడం, కడపలో డాక్టర్ అచ్చన్న, దళిత వ్యక్తిని చంపి డోర్ డెలివరీ చేసిన ఘటన, సీఎం సొంత నియోజకవర్గం పులివెందులలో దళిత మహిళలను అత్యాచారం చేసి చంపితే సీఎం జగన్ ఖండించకపోగా, డీజీపీ మాత్రం శాంతి, భద్రతలు బాగున్నాయని చెప్పడం ఆశ్చర్యంగా ఉందన్నారు. జగన్ నాలుగు సంవత్సరాల పాలనలో భౌతిక దాడులు, దోపిడీలు, దౌర్జన్యాలు, మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోవడమే కాక, జర్నలిస్టులపై సైతం దాడులు చేస్తున్నారన్నారు. పత్తికొండలో ఆంధ్రజ్యోతి విలేకరి రాజేశ్ గౌడ్ పై దాడి చేయడమే కాకుండా అక్రమంగా కేసులు బనాయించడాన్ని తీవ్రంగా ఖండించారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న హత్యలు, అత్యాచారాలు, దాడులు,దోపిడీలపై ఈనెల 22న సీపీఐ ఆధ్వర్యంలో విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని, అన్ని పార్టీలు, ప్రజాసంఘాలు, విద్యార్థి యువజన సంఘాలు కలిసి రావాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, సహాయ కార్యదర్శి ఎస్.ఎస్.రసూల్, మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్ బాబు పాల్గొన్నారు.

హమ్మయ్య చల్లబడింది

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఎన్నడూలేని విధంగా నిప్పులు చెరుగుతున్న ఎండలతో అల్లాడుతున్న ప్రజలకు ఉపశమనం లభించింది. రాష్ట్రంలో క్రమంగా నైరుతి రుతుపవనాలు విస్తరిస్తున్న ప్రభావంతో వాతావరణం చల్లబడింది. మంగళవారం మధ్యాహ్నం వరకు నిప్పులు చెరిగిన సూరీడు ఆ తర్వాత శాంతించాడు. ఈదురుగాలులతో ఒక్కసారిగా వాతావరణం మారడం, తర్వాత భారీ వర్షం కురవడంతో, రెండు నెలలుగా తీవ్ర వడగాడ్పులతో అల్లాడుతున్న విజయవాడ నగర ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. దశాబ్దకాలంతో ఎండల తీవ్రతను పరిశీలిస్తే ఈ ఏడాది ఎండలు, వడగాడ్పులు అధికంగా ఉన్నాయి. ముఖ్యంగా మూడు వారాలుగా 44 డిగ్రీల నుంచి 47 డిగ్రీల వరకు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండ తీవ్రతతో పాటు వడగాడ్పులు అధికం కావడంతో జనం పగలు రోడ్లపైకి రావాలంటేనే బేజారెత్తే పరిస్థితులు ఏర్పడ్డాయి. భారీ వర్షం కురవడంతో ప్రజలు సేదతీరారు. నగరంలోని ప్రధాన రహదారులు జలమయం అయ్యాయి. కృష్ణా, గుంటూరు, ప్రకాశం, ఎన్టీఆర్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లోనూ వర్షం కురిసింది. విజయవాడ నగరంలో 66.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా ప్రకాశం జిల్లా కొండేపిలో 64 మిల్లీమీటర్లు, ఎన్టీఆర్ జిల్లా ఏ కొండూరులో 58.5 మిల్లీమీటర్లు, గుంటూరు జిల్లా కొల్లిపరలో 49.5, మంగళగిరిలో 64 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వాస్తవానికి ఈనెల 11నే నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోని ప్రవేశించినా బిపర్జాయ్ తుపాను కారణంగా విస్తరణ ఆలస్యమైంది. ప్రస్తుతం రాయలసీమ, దక్షిణాంధ్రలోని కొన్ని

ప్రాంతాలకు, నెల్లూరు జిల్లా కావలి వరకు నైరుతి రుతుపవనాలు విస్తరించినట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలిపారు. దీని ప్రభావంతో రానున్న రెండు రోజులు రాష్ట్రంలో అక్కడక్కడా భారీ వర్షాలు, మిగిలిన చోట్ల తేలికపాటి జల్లు పడే అవకాశం ఉన్నట్లు వెల్లడించారు. బుధవారం పార్వతీపురం, మన్యం జిల్లా, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశమున్నట్లు తెలిపారు. అక్కడక్కడా పిడుగులు పడవచ్చని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అంతర్జాతీయ సిలబస్
జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్నేషనల్ బాకలారియేట్ (ఐబీ) సిలబస్ అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చెప్పారు. అలాగే పరీక్షలు అంటే చదువుకుని, జ్ఞాపకం పెంచుకుని, మెదడులోకి డ్రిల్ చేసి రాయడం కాకుండా... అంతర్జాతీయ తరహాలో పరీక్షా విధానం తీసుకొస్తామన్నారు. పరీక్షలకు వెళ్లేటప్పుడు పాఠ్యపుస్తకాలు తీసుకునిపోయినా ఫర్వాలేదనే విధానంలోకి.. ప్రాక్టికాలిటీకి దగ్గరగా, ప్రశ్నలన్నీ ఎనలిటికల్‌గా అంతర్జాతీయ సిలబస్ మాదిరిగా మన ప్రశ్నా పత్రాలు కూడా మార్పులు చేయాల్సిన అవసరం ఉందని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్ర స్థాయిలో 10వ తరగతిలో టాపర్‌గా నిలిచిన 42 మంది, ఇంటర్‌లో గ్రూపులు వారీగా టాపర్స్‌గా సత్తా చాటిన 26 మంది విద్యార్థులకు 'జగనన్న ఆణిముత్యాలు' అవార్డుతో మంగళవారం విజయవాడ ఏ-1 కన్వెన్షన్ సెంటర్‌లో సీఎం జగన్ చేతుల మీదుగా సత్కరించారు. వీరితో పాటు ఉన్నత విద్యలో 5 విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన 20 మంది విద్యార్థులకు కూడా 'స్టేట్ ఎక్స్‌లెన్స్ అవార్డులు' ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద వర్గాలే రేపొద్దున ప్రపంచాన్ని ఏలే పరిస్థితి నెలకొనేలా ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధి కోసం ఆ స్థాయిలో మార్పులన్నీ చేపడుతున్నామన్నారు. ఇక్కడికి వచ్చిన ప్రతి విద్యార్థి దగ్గర నుంచి ఈ కార్యక్రమాన్ని చూస్తున్న ప్రతి పిల్లాడు, పాప కూడా ఈ వయస్సు నుంచే మీ ఆలోచనలలోనే అత్యున్నత శిఖరాలకు ఎదగాలనే తపన మన ప్రతి మనస్సులోనూ ఉండాలనే లక్ష్యంతో అడుగు వేయాలని కోరారు. ఈ ప్రపంచాన్ని మారుస్తున్న సాంకేతికత, మారుతున్న చదువుల గురించి మన పిల్లలందరూ తెలుసుకోవాలన్నారు. అలాగే నాయకత్వ లక్షణాలు పెంచే విధంగా చదువులు ఉండాలన్నారు. టెన్త్, ఇంటర్, ఇంజనీరింగ్, మెడిసిన్ లేదా ఏదో ఒక డిగ్రీ తెచ్చుకోవడమే కాకుండా... ప్రపంచాన్ని శాసించబోయే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్సెస్, మెషీన్ లెర్నింగ్, ఎల్ఎల్ఎం, ఛాట్ జీపీటీ యుగంలో ఉన్న మన పిల్లలందరూ కూడా మారుతున్న ప్రపంచంలో ఎక్కడ ఉన్నాం? ఎంతగా ఎదగాలన్నది ఆలోచించాలన్నారు. రాబోయే రోజుల్లో పోటీతత్వం మరింత పెరుగుతుందని, దానికనుగుణంగా మనం వేగంగా మారకపోతే ఎక్కడుంటామో తెలియని పరిస్థితుల్లోకి పోతామని తెలిపారు. ఆ స్థాయిలో మెషిన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఛాట్ జీపీటీ యుగంలో విద్యా రంగం పూర్తిగా మారబోతోందని, ఈ మార్పును ప్రతి పేద వాడి దగ్గరకు తీసుకురావాలన్నదే ప్రభుత్వ తపన అని తెలిపారు. మాణిక్యాలన్నీ మట్టిలోనే తేలుతాయి. అరక దున్నినప్పుడే వజ్రాలు బయటికి వస్తాయన్నది ప్రతి ఒక్కరూ జ్ఞాపకం ఉంచుకోవాలన్నారు. మట్టి నుంచి గట్టిగా పెరిగిన ఈ మొక్కలు రేపు మహా వృక్షాలై ప్రపంచానికే అభివృద్ధి ఫలాలు అందించాలని కోరుకుంటున్నానంటూ సీఎం విద్యార్థులను ఆశీర్వదించారు.

ప్రభుత్వ బడులతో ప్రైవేటు బడులే పోటీపడేలా...

8వ తరగతి రాగానే ప్రతి విద్యార్థికి కంటెంట్ లోడెడ్ ట్యాబ్‌లు ఇస్తూ... ప్రభుత్వ బడులలో చదువుతున్న పిల్లలను ప్రోత్సహిస్తున్నామని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. మన పేదింటి పిల్లలంతా అంతర్జాతీయంగా ఎదగాలన్న ఉద్దేశంతో ఈ ఏడాది నుంచి మూడో తరగతి నుంచే వారిని టోఫెల్ పరీక్షకు సిద్ధం చేస్తున్నాం. అంతర్జాతీయ సర్టిఫికేషన్ ఇచ్చే దిశగా అడుగులు వేస్తున్నాం. పిల్లలు వినడం. మాట్లాడడం రెండింటిలో ఇంగ్లిషులో అంతర్జాతీయ స్థాయిలో పోటీపడే పరిస్థితి రావడం కోసం మన ప్రభుత్వ బడులలో ఈ టోఫెల్ పరీక్ష జరుగుతుందన్నారు. చదువుల కోసం అప్పుల పాలయ్యే పరిస్థితి రాకుండా, వారి చేతిలో డిగ్రీ సర్టిఫికెట్ ఉండాలని అనే తాపత్రయంతో విద్యాదీవెన, వసతి దీవెన కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. దీంతో పాటు విదేశాల్లో కూడా టాప్ 50 కళాశాలల్లో 21 ఫ్యాకల్టీల్లో 350 కళాశాలల్లో ఫీజు ఏకంగా రూ.1.25 కోట్లు వరకు చెల్లించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి బొత్స సత్యనారాయణ, మేరుగ నాగార్జున, తానేటి వనిత, విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మీ, శాసన సభ్యులు, విద్యాశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

స్వామీజీల అకృత్యం...
(మొదటిపేజీ తరువాయి)

వ్యక్తం చేస్తున్నాయి. విశాఖ వెంకోజి పాలెంలో జ్ఞానానంద ఆశ్రమ నిర్వాహకుడు పూర్ణానంద సరస్వతి స్వామీజీని ఎంవీపీ పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకొని విచారణ కొనసాగిస్తున్నారు. అభం శుభం ఎరగని చిన్నారిపై స్వామీజీ లైంగిక దాడిని ప్రజానీకం ముక్తకంఠంతో ఖండిస్తున్నారు. మంగళవారం విశాఖలో ఆశ్రమం వద్ద వివిధ మహిళా సంఘాలు ఆధ్వర్యంలో స్వామీజీని శిక్షించాలని నిరసన చేపట్టారు. పూర్ణానంద సరస్వతి పై గతంలో అనేక ఆరోపణలు వచ్చాయి. ఆశ్రమాల నిర్వహణ ముసుగులో అనేక అగత్యాలకు పాల్పడ్డారని అక్కడ పనిచేస్తున్న సిబ్బంది చెపుతున్నారు.

ఇదంతా కుట్ర: పూర్ణానంద

ఆశ్రమ భూములను కాజేయాలని కొందరు చూస్తున్నారని, అందులో భాగంగానే ఈ కుట్ర జరిగిందని పోలీసులు అదుపులో ఉన్న పూర్ణానంద స్వామీజీ చెబుతున్నారు. దీనిపై తాను కోర్టులో న్యాయపోరాటం చేస్తానని స్పష్టం చేశారు. సింహాచల దేవస్థానం తప్పు చేస్తోందని, దేవస్థానం భూములు కబ్జాకు గురవుతున్నాయని ఫిర్యాదు చేస్తే పట్టించుకోరని, కాని తనపైన ఆశ్రమంపైన కక్ష కట్టి ఇలా చేస్తున్నారని ఆరోపించారు. ఒక్కప్పుడు ఆశ్రమంలో 1000 మంది పిల్లలు ఉండే వారని, ఇప్పుడు 12 మంది మాత్రమే ఉంటున్నారన్నారు. ఆధ్యాత్మిక సేవ చేస్తుంటే అడ్డుకుంటున్నారని, బాలికను మచ్చిక చేసుకుని తనపై తప్పుడు ఫిర్యాదు చేయించారని, తగిన న్యాయ పోరాటం చేస్తానని స్వామీజీ వివరణ ఇచ్చారు. సీఐ మల్లేశ్వరరావు నేతృత్వంలో ఎంవీపీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆశ్రమం భూములపై కన్నేసే తప్పుడు కేసులు

ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతీ స్వామి పలువురు స్వాములతో కలిసి మంగళవారం సాయంత్రం విశాఖపట్నం లోని వెంకోజీపాలెంలో ఉన్న రామానంద, జ్ఞనానంద ఆశ్రమానికి వచ్చారు. పోలీసులు వారిని లోనికి అనుమతించకపోవ డంతో కొంతసేపు తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ సందర్భంగా శ్రీనివాసనంద మాట్లాడుతూ గతంలో వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ఆశ్రమం భూములపై కన్నేసి, ఆవులను సైతం వెళ్లగొట్టి, ఆశ్రమంలో ఉన్న పిల్లలను భయభ్రాంతులకు గురిచేసిన సంఘటనలు ఉన్నాయన్నారు. వైసీపీ రాబందులు, గద్దలు ఈ ఆశ్రమం భూములు తన్నుకుపో యేందుకే పూర్ణానందస్వామిపై తప్పుడు కేసులు బనాయించారని మండిపడ్డారు. నాలుగేళ్ల వైసీపీ పాలనలో దేవాలయ భూములు, ఆశ్రమం భూములతో పాటు విశాఖలో విలువైన ఆస్తులపై కన్నేసి తప్పుడు కేసులు బనాయించి, బెదిరిస్తూ ఈ రకమైన చర్యలకు దిగుతున్నారని హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరిపిస్తే నిజ నిజాలు వెలుగులోకి వస్తాయని అన్నారు.

నాపై విమర్శలు ఆపి
ప్రత్యేక హోదా కోసం పోరాడండి
పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలకు ముద్రగడ ఘాటు లేఖ

విశాలాంధ్ర-కిర్లంపూడి : నా మీద విమర్శలు ఆపి రాష్ట్ర ప్రజలపై మీకు నిజంగా ప్రేమ ఉంటే ప్రత్యేక హోదా సాధన కోసం కృషి చేయాలని, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్మకం నుంచి కాపాడాలని మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం... పవన్ కళ్యాణ్‌ను ఉద్దేశించి అన్నారు. ప్రత్యేక రైల్వే జోన్, కడప స్టీల్ ప్లాంట్ వంటి సమస్యలపై యుద్ధం చేయాలని కోరారు. జనసేన అధినేత, ప్రముఖ నటుడు పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై ఘాటుగా స్పందిస్తూ మంగళవారం ముద్రగడ బహిరంగ లేఖ విడుదల చేశారు. కులాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయ నాయకుడుగా ఎదగడం, యువతను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవడం మా ఇంటా వంటా లేదు. నేను ఈ లేఖ మీకు రాసినందుకు ఎక్కడా లేని కోపం రావచ్చు. రాష్ట్రంలో ఉన్న కోట్లాది మంది మీ అభిమానుల చేత నన్ను తుద ముట్టించాలనే ప్రయత్నం చేయవచ్చు. అయినా నిజాన్ని నిర్భయంగా రాయాలనిపించి రాస్తున్నా. ప్రభుత్వాలు మారినప్పుడల్లా నేను ఉద్యమాలు చేయలేదు. చంద్రబాబు నాయుడి ద్వారా పోగొట్టుకున్న బీసీ రిజర్వేషన్లు పునరుద్ధరిస్తానని పదే పదే చెప్పడం వల్ల బాబు ద్వారా రోడ్డు మీదకు వచ్చే పరిస్థితి మీరే కల్పించారని పవన్‌ను ఉద్దేశించి అన్నారు. నేను కులాన్ని అడ్డుపెట్టుకుని ఎప్పుడూ ఏ పదవి పొందలేదు. ఓటమి ఎరుగని నాకు కాపు ఉద్యమంతో ఓటమికి దగ్గరయ్యానన్నారు. నాకన్నా బలవంతులు మీరు. నేను వదిలేసిన కాపు ఉద్యమాన్ని మీరు చేపట్టి యువతకు రిజర్వేషన్ ఫలాలు ఎందుకు తీసుకురాలేదో చెప్పాలని పవన్‌ను ముద్రగడ ప్రశ్నించారు. ద్వారంపూడి కుటుంబాన్ని తిట్టడానికి మీ విలువైన సమయాన్ని వృధా చేసుకోకండని హితవు పలికారు. ద్వారంపూడి కుటుంబం తప్పుడు మార్గాలలో సంపాదించారని అనడం చాలా తప్పు అని ముద్రగడ అన్నారు. కాపు ఉద్యమాలలో సహకరించిన ద్వారంపూడి కుటుంబాన్ని విమర్శించడం మీకు తగదన్నారు. కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి దొంగ అయితే రెండు సార్లు ఎమ్మెల్యేగా ఎలా గెలిచారో మీరే చెప్పాలన్నారు. ప్రసంగాల్లో తొక్క తీస్తా... నారా తీస్తా... చెప్పుతో కొడతా... గుండు గీయిస్తా అని పదేపదే అంటున్న మీరు... ఇంత వరకు ఎంత మందికి నార తీశారు... ఎంత మందిని చెప్పుతో కొట్టారో చెప్పాలన్నారు. పార్టీ పెట్టిన తర్వాత పది మంది చేత ప్రేమించబడాలి గాని, వీధి రౌడీ భాషలో మాట్లాడడం ఎంతవరకు న్యాయమని పవన్ కళ్యాణ్‌ను ముద్రగడ ప్రశ్నించారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ప్రభుత్వం తీసుకున్న సంక్షేమ బోర్డు నిధులు జమ చేయాలి
- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : దశాబ్దాల తరబడి పోరాటాలు చేసి సాధించుకున్న సంక్షేమ బోర్డును వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్వీర్యం చేసి కార్మికుల పట్ల కక్షపూరిత ధోరణితో వ్యవహరిస్తోందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ విమర్శించారు. భవన నిర్మాణ రంగ కార్మికుల పెండింగ్ క్లెయిమ్‌లను పరిష్కరించటంతో పాటు ఇతర సంక్షేమ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) ఇచ్చిన 'చలో విజయవాడ' కార్యక్రమంలో భాగంగా మంగళవారం ధర్నా చౌక్ వద్దకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న భవన నిర్మాణ కార్మికులు పెద్దఎత్తున తరలి వచ్చారు. ఈ నిరసన కార్యక్రమానికి ప్రధాన వక్తగా విచ్చేసిన రవీంద్రనాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల వలన ప్రతి ఒక్కరూ ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ నిరసనలు తెలిపేందుకు రోడ్డు మీదకు వస్తుంటే అడుగడుగునా ఆటంకాలు సృష్టించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ధ్వజమెత్తారు. భవన నిర్మాణ రంగ కార్మికులను ఈ సభకు రాకుండా ప్రతి జిల్లాలోను పోలీసులు నిర్బంధాలు సృష్టించారని తెలిపారు. తండ్రిని మించిన తనయుడుగా ఉంటానని చెప్పిన జగన్‌మోహన్ రెడ్డి తన తండ్రి పెట్టిన పథకానికి తూట్లు పొడిచి రాష్ట్రంలో 50 లక్షల మంది కార్మికుల కడుపులు కొడుతున్నారని తెలిపారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం 1996 నుంచి దేశవ్యాప్తంగా అమలవుతున్నా, రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి బోర్డును తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. కార్మికుల వద్ద నుంచి సంక్షేమ బోర్డులో సభ్యత్వం పేరుతోను, భవన నిర్మాణ యజమానుల నుంచి సెస్ పేరుతో వసూలు చేస్తున్నా వేల కోట్ల నిధులను జీవో నంబరు 17 ద్వారా పవర్ ఫైనాన్స్ పేరుతో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు, ఇతర ప్రయోజనాలకు దారి మళ్లించుకుంటున్నదని అన్నారు. ఈ ప్రభుత్వం కష్టజీవుల పక్షపాతినని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. 2018 నుంచి ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న సుమారు 45 వేల క్లెయిమ్‌ల నిధులను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ యూనియన్ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందని తెలిపారు. భవన నిర్మాణ రంగం కుదేలై, కార్మికుల కుటుం బాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ, అనేక మంది ఆత్మహత్యలకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం వారి కష్టాన్ని మరింతగా పెంచి గడప గడపకు వైసీపీ అని సంబరాలు చేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిన రూ. 1,200 కోట్లు సంక్షేమ బోర్డు నిధులను వెంటనే బోర్డుకు జమ చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కార్మికుల నిధులను వారి ప్రయోజన కోసం ఖర్చు పెట్టాలని, ఇష్టానుసారంగా పెంచుకుపోతున్న స్టీలు, సిమెంటు, ముడి సామాగ్రి మొదలైన ధరలను నియంత్రించాలని, లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని రవీంద్రనాథ్ హెచ్చరించారు. ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ మాట్లాడుతూ సంక్షేమ బోర్డు నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇతర పథకాలకు మళ్లించిందని మండిపడ్డారు. ప్రభుత్వ చర్యల వలన నిర్మాణరంగం కుదేలై, కార్మికులు ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సంక్షేమ బోర్డు అమలు చేస్తున్న పథకాలను రద్దు చేయడంతో మరోపక్క కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. ప్రభుత్వం తక్షణమే బోర్డుకు నిధులు జమ చేసి సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎస్.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నాలుగేళ్లుగా ఎమ్మెల్యేలు, మంత్రుల నుంచి ముఖ్యమంత్రి వరకు, జిల్లా రెవెన్యూ, కార్మిక శాఖ అధికారులకు వినతి పత్రాలు సమర్పించి, ఆందోళన చేస్తున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందని అన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి చట్ట అమలుపై తీవ్ర నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో సుమారు 50 లక్షల మంది భవన నిర్మాణ రంగంలో వివిధ రకాల పనులు చేస్తున్నారని అన్నారు. అయితే వేల కోట్ల రూపాయల ఆదాయం కలిగిన సంక్షేమ బోర్డు విధివిధానాలపై చర్చించి పరిష్కారం చేయాలన్న ఆలోచన లేకపోవడం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. బోర్డు ద్వారా సంక్షేమ పథకాలను కార్మికులకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సభాధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్. నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కష్టజీవుల పక్షపాతినని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. 2018 నుంచి పెండింగ్‌లో ఉన్న సుమారు 45 వేల క్లెయిమ్‌ల నిధులు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ యూనియన్ నిరంతరం పోరాటాలు చేసిందని, అయినా ప్రయోజనం లేకపోవడంతో ఈ ఆందోళనకు పిలుపు ఇచ్చినట్లు తెలిపారు. ఈ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి భవన నిర్మాణ కార్మికులను చిన్న చూపు చూడడమే కాకుండా సంక్షేమ బోర్డును రద్దు చేయాలనే దుర్మార్గపు ఆలోచనలో జగన్ మోహన్ రెడ్డి ఉన్నారని విమర్శించారు. ధరలు విపరీతంగా పెరిగిపోతున్న నేపథ్యంలో కార్మికుల కుటుం బాలు పూట గడవక, ఇంటి అద్దెలు కట్టలేక, పిల్లలను చదివించుకోలేక, కుమార్తె వివాహాలు చేయలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిన సంక్షేమ బోర్డు నిధులను వెంటనే బోర్డుకు జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్ర మంలో ఏఐటీయూసీ నగర కార్యదర్శి ఎం.సాంబశివరావు, జిల్లాల కార్యదర్శులు కె.సత్తిబాబు, సోనారాజు, శ్రీరాములు, శ్రీనివాస్, డి.సి.రెహ్మాన్, కాసా సాంబయ్య, మల్లాడ నాగరాజు, సిహెచ్.వి.రమణ, మూర్తియార్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లతో కట్టేసి మాజీ ఎంపీటీసీపై దాడి

విశాలాంధ్ర-అవుకు : నంద్యాల జిల్లా అవుకు మండలంలోని అత్యంత సమస్యాత్మక గ్రామమైన చనుగొండ్లలో ఎంపీటీసీ మాజీ సభ్యుడిపై దాడి జరిగింది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు బైరెడ్డి చెన్నకేశవరెడ్డిపై అదే గ్రామానికి చెందిన పద్మనాభ రెడ్డి, నిరంజన్ రెడ్డి, సుంకిరెడ్డి, వేణుగోపాల్ రెడ్డితో పాటు మరి కొంతమంది సోమవారం రాత్రి ముకుమ్మడిగా దాడి చేసి, అర్ధ నగ్నంగా తాళ్లతో కట్టి చెట్టుకు కట్టి విచక్షణారహితంగా కొట్టారు. విషయం గ్రామంలో తెలియడంతో బైరెడ్డి చెన్నకేశవరెడ్డి వర్గానికి చెందిన వారు అక్కడికి రావడంతో ప్రత్యర్థులు పరారయ్యారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడకు చేరుకుని చెన్నకేశవరెడ్డిని వైద్యం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రత్యర్థులను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ నిమిత్తం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇలాంటి సమస్యాత్మకమైన ఫ్యాక్షన్ గ్రామంలో పోలీసులు నిఘా ఉంచడంలో విఫలమయ్యారని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. మండలంలో శాంతిభద్రతలు ఉన్నాయా లేవా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. పాత కక్షల కారణంగానే గొడవలు జరిగాయని బనగానపల్లె సీఐ తిమ్మారెడ్డి తెలిపారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో ఎవరైనా గొడవలకు దిగి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర-నంద్యాల: నంద్యాల పట్టణానికి చెందిన చిన్నబాబు అనే వ్యక్తి పోలీసుల వేధింపులు తాళలేక మంగళ వారం రైలు కింద పడి ఆత్మహత్యకు చేసుకున్నాడు. నంద్యాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తోటిలైన్ వీధికి చెందిన చిన్నబాబును బైక్ దొంగతనం కేసును ఒప్పుకోవాలంటూ పోలీసులు తీవ్రంగా కొట్టడం వల్ల మనస్తాపానికి గురై రైలు కింద పడి ప్రాణాలు తీసుకున్నాడు. తనను వన్‌టౌన్ ఎస్ఐ సుబ్బరామిరెడ్డి, కానిస్టేబుళ్లు నాగన్న, ఏసుదాసు తాను చేయని తప్పును ఒప్పుకోవాలని గత రాత్రి స్టేషన్‌లో తీవ్రంగా కొట్టారని సెల్ఫీ వీడియోలో తెలిపాడు. చినబాబును తిరిగి ఉదయం రమ్మనడంతో తాను చేయని నేరాన్ని ఎలా ఒప్పుకోవాలని, బైక్ ఎక్కడ నుంచి తెచ్చి ఇవ్వాలంటూ సెల్ఫీ వీడియో తీస్తూ రైల్వే ట్రాక్ వెంట పరిగెత్తాడు. మంగళవారం ఉదయం మహానంది మండల పరిధిలోని గోపవరం గ్రామ సమీపంలో రైల్వే ట్రాక్ వెంట పరిగెడుతూ రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వేధింపుల వల్లే తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని, తన చావుకు పోలీసులే కారణమంటూ సెల్ఫీ వీడియో తీయడంతో ఆ వీడియో వైరల్ అయి నంద్యాలలో కలకలం సృష్టించింది. అయితే దీనిపై పోలీసు అధికారులు ఇంకా స్పందించలేదు. చిన్నబాబు కుటుంబ సభ్యులు మాట్లాడుతూ పోలీసుల వేధింపుల వల్లే చిన్నబాబు సెల్ఫీ వీడియో తీసుకుంటూ రైలు కింద పడడం ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని పోలీసు ఉన్నతాధికారులను కోరారు.

ఏసీబీ వలలో అవినీతి సీఐ

విశాలాంధ్ర-యర్రగుంట్ల: అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ) అధికారులు మంగళవారం ఎర్రగుంట్ల పోలీస్‌స్టేషన్‌పై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అవినీతికి పాల్పడుతున్న సీఐని, అతనికి సహకరిస్తున్న ఓ విలేకరిని అదుపులోకి తీసుకున్నారు. వివరాలను ఏసీబీ అడిషినల్ ఎస్పీ దేవీప్రసాద్ వివరించారు. ఎర్రగుంట్ల సమీపంలోని నాపరాయి గనుల వద్ద వ్యర్థాలు, నల్లమట్టిని ప్రొద్దుటూరు ప్రాంతంలోని వెంచర్లకు, ఇతరత్రా అవసరాల నిమిత్తం తీసుకువెళుతుంటారు. అందులో భాగంగా స్థానిక నివాసి గరిషా గంగాధర్‌రెడ్డి నాపరాయి వ్యర్థాలను తరలించడం వ్యాపకంగా కొనసాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో సీఐ మంజునాథరెడ్డి రెండేళ్లుగా సదరు వ్యక్తి నుండి ప్రతి నెల రూ.15వేల వంతున మామూళ్లు స్వీకరిస్తున్నారు. అయితే గత రెండు నెలల క్రితం ట్రిప్పుకు రూ.వెయ్యి వంతున ఇవ్వాలని సీఐ డిమాండ్ చేయడంతో అంత మొత్తం ఇవ్వలేనని గంగాధర్‌రెడ్డి తేల్చిచెప్పారు. దీంతో అతడి టిప్పర్ వాహనాన్ని సీఐ మంజునాథరెడ్డి తీసుకెళ్లి పోలీసు క్వార్టర్స్ వద్ద నెలరోజుల పాటు ఉంచారు. చేసేదేమీ లేక గంగాధర్‌రెడ్డి ట్రిప్పుకు రూ.700లు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. అందుకు సంబంధించి రూ.18వేలు సీఐకి ఇచ్చిన గంగాధర్‌రెడ్డి... మంగళవారం మిగిలిన రూ.8600ల మొత్తాన్ని సీఐకి అప్పగించేందుకు మధ్యవర్తిగా ఉన్న విలేకరికి ఇస్తుండగా... అదే సమయంలో ఏసీబీ అధికారులు దాడి చేసి సదరు విలేకరిని అదుపులోకి తీసుకున్నారు. కాగా ఏదో పని నిమిత్తం కర్నూలు వెళ్లిన సీఐ మంజునాథరెడ్డి అక్కడే ఏసీబీ బృందం అదుపులోకి తీసుకొని ఎర్రగుంట్లకు తరలించారు. ఈ కేసులో సెల్‌ఫోన్‌లో రికార్డయిన ఆధారాలను సైతం ఏసీబీ అధికారులు సేకరించగలిగారు. పక్కా ఆధారాలు లభ్యమైనట్లు ఏఎస్పీ దేవీప్రసాద్ స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా ఏకంగా పోలీసుస్టేషన్‌పైనే ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించడంతో పట్టణంలో మిగతా ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో అలజడి కనిపించింది.

ఏపీలో అధికారమే లక్ష్యం: కాంగ్రెస్

విశాలాంధ్ర బ్యూరో -అమరావతి: ఆంధ్రప్రదేశ్ లో వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అధికారంలోకి రావడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోందని ఏఐసీసీ కార్యదర్శులు మయప్పన్, క్రిస్టోఫర్ తిలక్, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు తెలిపారు.విజయవాడ ఆంధ్రరత్నభవన్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో రుద్రరాజు తో కలిసి ఏఐసీసీ కార్యదర్శులు పార్టీ పనితీరుపై సమీక్షించారు. దీనికి వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలీ, సుంకర పద్మశ్రీ, జంగా గౌతమ్, రాకేష్ రెడ్డి తో పాటు సోషల్ మీడియా కమిటీ చైర్మన్ రాకేష్, సభ్యులు హాజరయ్యారు. ఏడు నెలలుగా గిడుగు రుద్రరాజు పార్టీ బలోపేతానికి పటిష్ట చర్యలు తీసుకుం టున్నారని, జిల్లాల పర్యటనలు, పాదయాత్ర, బహిరంగ సభ నిర్వహించి పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచి కార్యకర్తలలో చైతన్యం తీసుకొచ్చారని రుద్రరాజు ను ఏఐసీసీ కార్యదర్శులు అభినం దించారు. అమెరికాలో రాహుల్ గాంధీ పర్యటన విజయవంతం కావడంలోను, ప్రవాస భారతీయులను ఏకతాటిపై తీసుకువచ్చి సభ నిర్వహించడంలోను రుద్ర రాజు కృషి ఉందన్నారు.

నలుగురు గంజాయి స్మగ్లర్ల అరెస్టు

విశాలాంధ్ర-మచిలీపట్నం: జిల్లా వ్యాప్తంగా గంజాయి, మాదకద్రవ్యాల నేరస్తులపై కృష్ణాజిల్లా పోలీసులు ఉక్కు పాదం మోపారని జిల్లా ఎస్పీ పి.జాషువా తెలిపారు. నలుగురు అంతర్ రాష్ట్ర గంజాయి స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. గుడివాడ లో కాలేజీ యువతకు గంజాయి విక్రయిస్తుండ గా ఒక స్మగ్లర్‌ను, ఘంటసాల పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు స్మగ్లర్ లను అరెస్ట్ చేశామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, ఢిల్లీ, కర్ణాటక, పూణే రాష్ట్రాల్లో ఉన్న 64 మంది గంజాయి స్మగ్లర్ కు గంజాయిని రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్న కొర రాందాస్ అలియాస్ బట్టు బాయ్ తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో క్రైమ్ నెంబర్ 137/2023 కేసు ఉన్న నలుగురు ముద్దాయిలలో ప్రధాన నిందితుడు. అప్పటినుండి పరారీలో ఉన్న రాందాస్ ను అదుపులోనికి తీసుకోవడం జరిగిందన్నారు. అంతేకాక అతని బైక్‌ను, 5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ అంతరాష్ట్ర స్మగ్లర్ తన గంజాయి నెట్‌వర్క్‌ను విస్తరించుకునే క్రమంలో మచిలీపట్నం వస్తుండగా పోలీసులు వల పన్ని పట్టుకున్నారని వెల్లడించారు. ఇతడు చత్వా కేంద్రంగా శిలావతి మొదలగు గంజాయి జాతులను దేశ వ్యాప్తంగా ఉన్న స్మగ్లర్ లకు రవాణా చేస్తున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న గంజాయి విక్రయాలు దారులతో పరిచయాలు ఏర్పరచుకొని 64 మందితో వ్యాపార లావాదేవీలన్నీ కేవలం వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా సాగిస్తున్నాడన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ ఆర్ శ్రీహరిబాబు, బందరు డీఎస్పీ మాధవ రెడ్డి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ప్రజలపై భారాలు తగ్గించాలి

అనకాపల్లిలో సీపీఐ నిరసన

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించాలని, ట్రూ అప్, సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని, వ్యవసాయ మోటర్లకు స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రతిపాదన విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో అనకాపల్లి ఎమ్మార్వో కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. అదే సమయంలో మండల సర్వసభ్య సమావేశానికి మంత్రి గుడివాడ అమర్నాథ్ హాజరైన విషయం తెలుసుకున్న సీపీఐ నాయకులు మంత్రి వచ్చి సమస్య విని వినతిపత్రం తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అక్కడే బైఠాయించారు. పట్టణ ఎస్ఐ దివాకర్ ఆందోళనకారుల వద్దకు వచ్చి నినాదాలు చేయొద్దంటూ వారించారు. మంత్రి వచ్చి వినతిపత్రం తీసుకునే వరకు కదిలేది లేదంటూ నినాదాలు చేస్తూ ఎండలోనే నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న మంత్రి ఆందోళనకారుల వద్దకు వచ్చి వినతిపత్రం స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ, విద్యుత్ చార్జీలను నిరంతరం పెంచుకుంటూ పోతున్నారని విమర్శించారు. వేళాపాళా లేకుండా విద్యుత్ కోతలు విధించడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అప్పలరాజు, సన్యాసిరావు, రాజు, ఫణీంద్ర కుమార్, నాయకులు ఈశ్వరరావు, ఎం.సత్తిబాబు, సాయి, రామారావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలు కరువు

- రాష్ట్రంలో 15 రోజుల్లో 15 ఘోరాలు
- వెంటనే ఆర్టికల్ 355 అమలు చేయాలి
- గవర్నర్‌తో టీడీపీ నేతలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా విఫలమయ్యాయని, తక్షణమే ఆర్టికల్ 355ని అమలు చేయాలని టీడీపీ నేతలు గవర్నర్‌ను కోరారు. రాజ్‌భవన్‌లో మంగళవారం సాయంత్రం టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు ఆధ్వర్యంలో పార్టీ బృందం గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కల్సి రాష్ట్రంలో జరుగుతున్న వరుస నేరాలు, ఘోరాలపై ఫిర్యాదు చేశారు. చెరుకుపల్లిలో అమర్నాథ్ సజీవ దహనం, మహిళలపై అత్యాచారాలు, విశాఖ ఎంపీ కుటుంబం కిడ్నాప్, హత్యలు, దాడులు వంటి ఘటనలు 15 రోజుల్లో 15 జరిగాయని గవర్నర్‌కు తెలిపారు. గవర్నర్‌ను కల్సిన వారిలో అచ్చెన్నాయుడు, నక్కా ఆనంద్ బాబు, బొండా ఉమ, గద్దె రామ్మోహన్, వర్ల రామయ్య, అనగాని సత్యప్రసాద్ ఉన్నారు. అనంతరం అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడుతూ నాలుగేళ్ల కాలంలో జరిగిన దమనకాండ అంతా ఒక ఎత్తయితే జూన్ నెలలో 15 రోజుల్లో 15 సంఘటనలు జరిగాయన్నారు. రాష్ట్రంలో రోజుకో హత్య, రోజుకొక దోపిడి, మానభంగం జరుగుతోంది. ఈ విధంగా రాష్ట్రంలో నిత్యకృత్యమైపోయి రాష్ట్రంలో పూర్తిగా శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా ఉంది. కాబట్టి ఈ విషయాన్ని గవర్నర్‌కు స్పష్టంగా వివరించామని తెలిపారు. వైసీపీ ఎంపీ కుటుంబాన్ని కిడ్నాప్ చేసి 48 గంటలు కనీసం పోలీసులకు తెలియకుండా చేయడమంటే ఈ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా? అని ప్రశ్నించారు. అదే ఎంపీ ఈ రాష్ట్రంలో బతకలేమని చెప్పడం, ఈ ప్రదేశంలో తాను వ్యాపారాలు చేయలేనని చెప్పడం ఎంత దుర్మార్గమో అర్థమౌతుందన్నారు. సొంత పార్టీ ఎంపీనే తాను తెలంగాణకు మారుతున్నానని చెప్పాడంటే సీఎం సిగ్గుపడాలన్నారు. ఉద్యోగ సంఘాలు చేస్తున్న ఉద్యమాలను అణచివేయడానికి తప్ప పోలీసు వ్యవస్థ ప్రజలకు ఉపయోగపడటం లేదని, సాక్షాత్తు రాష్ట్ర పోలీసు అధికారి ప్రెస్ మీట్ పెట్టి శాంతి భద్రతలు బాగానే ఉన్నాయనడం పోలీసు వ్యవస్థ ఎంతకు దిగజారిపోయిందో అర్థమౌతోందన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు కేంద్రం వెంటనే జోక్యం చేసుకొని సెక్షన్ 355 ద్వారా రాష్ట్రాన్ని కాపాడాలని, మణిపూర్ జరిగిన సంఘటన విషయంలో కేంద్రమే జోక్యం చేసుకొని అధికారి నియమించినట్లు ఈ రాష్ట్రంలో కూడా అదే పద్ధతిని అమలు చేయాలని గవర్నర్‌ను కోరామన్నారు.

టీటీడీలో శ్రీవాణి ట్రస్ట్‌కు భద్రత ఉందా?

మాజీ మంత్రి బండారు



విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: టీటీడీ శ్రీవాణిట్రస్ట్‌కి భద్రత ఉందా అని మాజీ మంత్రి బండారు సత్య నారాయణ మూర్తి ప్రశ్నించారు. మంగళవారం జిల్లా తెలుగుదేశం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం 2019లో శ్రీవాణి ట్రస్ట్ పెట్టిందని, 10 వేల రూపాయల టికెట్ తెచ్చారని, 500 టికెట్ 10 వేల టికెట్ వేర్వేరుగా ఎందుకు ఇస్తున్నారుని ప్రశ్నించారు. తాను కుటుంబంతో వెళ్లినప్పుడు రూ.30 వేలు ఇచ్చి టికెట్లు కొన్నాననీ, ఎటువంటి రశీదు ఇవ్వలేదని, దేవుని ఖాతా ఉన్నప్పుడు శ్రీవాణి ట్రస్ట్ అనే పేరు ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. ట్రస్ట్‌గా ఉన్నా భద్రత లేదని, ఎన్ని టికెట్లు అమ్ముతున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎంత వచ్చిందో ? ఎపుడు చెప్పలేదని, ఎక్కడ జమ చేస్తున్నారో చెప్పలేదన్నారు. నాలుగేళ్లుగా ఎన్ని టికెట్లు అమ్మారో, ఎవరు కొన్నారో వివరాలు తెలపాలన్నారు. నాలుగేళ్లలో నాలుగు వేల కోట్లు వసూలు చేసుంటారని, ప్రతి రూపాయి ఖాతాలో జమ అవ్వాలని కాగ్ కూడా చెప్పిందన్నారు. దేవుని సొమ్ము కొట్టేయాడానికి ట్రస్ట్ లు పెట్టకూడదని, గతంలో తిరుమల కొండల గురుంచి అపహాస్యం చేసిన వారు ఏమయ్యారో అందరికి తెలుసన్నారు. జగన్ కుటుంబం నుంచి ఈ దోపిడీని ఆపాలన్నారు. వేంకటేశ్వరుని విషయంలో రాజకీయాలు వద్దనీ, బెదిరిస్తే బయ పడేది లేదని, ఏడు కొండల వాడికోసం దేనికైనా సిద్ధమని చెప్పారు. విశాఖ ఎంపీ కుటుంబం కిడ్నాప్ అయితే ఇంతవరకు సీఎం జగన్ కనీసం మాట్లాడలేదనీ, ఏపీ నుంచి అనేక కంపెనీలు వెళ్లి పోయాయన్నారు. సొంత ఎంపీ వెళ్లి పోవడంలో ఆశ్చర్యం ఏముందన్నారు. జగన్ పాలనలో సామాన్యులు కూడా వెళ్లిపోయే పరి స్థితులు ఉన్నాయని, హైదరాబాద్ లో ఓ ఇంటి లో తీవ్రవాదులు ఉంటే ఇంటెలిజెన్స్ ద్వారా పట్టుకున్నారని, ఏపీలో ఇంటె లిజెన్స్ పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. ఏపీలో గంజాయి, డ్రగ్స్ విచ్చల విడిగా ఉంటే డీజేపీ లేదంటారని, గంజాయి మత్తు లోనే రాష్ట్రంలో అనేక అకృత్యాలు జరుగు తున్నాయని బండారు ఆవేదన వ్యక్తం చేశారు.

'సాగు' ఎలా?

- కానరాని వర్షం
- మండుతున్న ఎండలు
- బీళ్లవుతున్న భూములు
- రైతుల్లో ఆందోళన

విశాలాంధ్ర-చిలకలూరిపేట: తీవ్ర వర్షాభావంతో సాగు ప్రశ్నార్థకంగా మారుతోంది. రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. తొలకరి ముఖం చాటేసింది. దీంతో పంటల సాగుపై రైతుల్లో సందిగ్ధం నెలకొంది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలోని 48 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. అనేక మండలాల్లో ఇప్పటి వరకు చినుకు రాలలేదు. మొత్తంగా 70.46 శాతం లోటు వర్షపాతం నమోదైంది. పొలాలను దుక్కులు దున్ని సాగుకు అన్నదాతలు సమాయత్తమయ్యారు. చినుకు రాలక పోతుండటంతో తీవ్ర ఆందోళన చెందు తున్నారు. వరుణుడి కరుణ కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. గత ఏడాది సమయానికి సమృద్ధిగా వర్షాలు కురవటం, ప్రాజెక్టులు నిండటంతో వరి, పత్తి, మిరప తదితర పంటలను విస్తృతంగా రైతులు సాగు చేశారు. వర్షాకాలం ప్రారంభమై రోజులు గడుస్తున్నా అక్కడక్కడ చిరు జల్లులు తప్ప పంటల సాగుకు అనుకూలమైన వర్షాలు కురవలేదు. పల్నాడు జిల్లాలో ఇప్పటికే 30.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 7.2 మిల్లీ మీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. 76.30 శాతం తీవ్ర లోటు వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ ప్రకటించింది. జిల్లాలో అనేక మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెల కొన్నాయి. ఒక్క మండలంలో సాధారణ వర్షపాతం నమోదైంది. గుంటూరు జిల్లాలో ఇప్పటికి 36.10 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. అయితే 11.40 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. 68.4 శాతం లోటు నెలకొంది. జిల్లాలో 18 మండలాలకు గాను ఒక మండలంలో చినుకు రాలలేదు. 12 మండలాల్లో తీవ్ర వర్షాభావం, 3 మండలాలలో వర్షభావ పరిస్థితులు నెలకొన్నాయి. రెండు మండలాలలో సాధారణ వర్షపాతం నమోదైంది. బాపట్ల జిల్లాలో ఇప్పటికి 25.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 7.60 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. 70.30 శాతం లోటు వర్షపాతం నమోదైంది. పల్నాడు జిల్లాలో పంటల సాగు సాధారణ విస్తీర్ణం 6,51,657 ఎకరాలు. గుంటూరు జిల్లాలో 3,20,140, బాపట్ల జిల్లాలో 3,47,220 ఎకరాలు, అత్యధిక శాతం వరి, పత్తి, మిరప సాగు చేస్తారు. ఈ మూడు ప్రధాన పంటల సాగుకు వాతావరణం అనుకూలించటం లేదు. చినుకు రాలకపోతుం డటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మెట్ట పంటలను సాగు చేసేందుకు పొలాలను రైతులు దుక్కులు దున్నారు. వరి సాగుచేసే పొలాల్లో దుక్కులు దున్నేందుకు రైతులు సాహసం చేయటం లేదు. మొత్తం మీద పంటల సాగుకు గడ్డుకాలం నెలకొంది. ఏరువాక వెళ్లి పది రోజులు గడిచినా మృగశిర కార్తె పోయి ఆరుద్ర వచ్చినా వానలు కురవడం లేదు. ఇప్పటికే పొలాల్లో విత్తనాలు నాటడం పూర్తి కావాల్సి ఉంది. రైతులు భూములన్నీ చదును చేసి పంటల సాగుకు సిద్ధం చేసి వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. ఎప్పుడు భూమి తడిసేలా వాన కురుస్తుందా? ఎప్పుడు విత్తనాలు వేద్దామా? అని వేచి చూస్తున్నారు. వర్షాలు కురిస్తే ఈపాటికి పొలాల్లో విత్తనాలు విత్తడం పూర్తయ్యేదని చెబుతున్నారు. అయితే ఇంకా ఎక్కడ కూడా విత్తనాలు వేసిన పొలాలు కన్పించడం లేదు. దీంతో ఈ ఏడాది ఖరీఫ్ సాగు ఆలశ్యమయ్యే అవకాశం స్పష్టమవుతోంది. ముమ్మరంగా వర్షాలు కురిసి పొలాల్లో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నం కావాల్సిన తరుణంలో ఎండలు మండిపోతున్నాయి. వానలు కురవక, అరక సాగక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఈసారి కొందరు రైతులు ఆశతో ముందుగానే భూములను దున్ని, వర్షం పడితే విత్తనాలు చల్లేందుకు సిద్ధపడగా, మరికొందరు వర్షాభావంతో దున్నేందుకు సైతం ముందుకు రావడం లేదు. దీంతో భూములన్నీ బీళ్లుగా దర్శనమిస్తున్నాయి.

సంపాదకీయం

సొంత కుదురులోనే మోదీపై అసంతృప్తి

దేశవాసులు ఎదుర్కుంటున్న సమస్యల గురించి మోదీ ఎప్పుడూ మాట్లాడరు. కానీ ఆయన అమెరికా పర్యటనకు వెళ్తున్న సందర్భంగా ముందే మన్ కీ బాత్ ప్రసారమైపోయింది. ఇటీవలే మన్ కీ బాత్ వందవ ప్రసారం గురించి చాలా హడావుడి చేశారు. మణిపూర్ మండి పోతున్నా, నెలపై నుంచి అక్కడ బీజేపీని సమర్థించే మెయితీలకు ఇతర గిరిజన తెగలకు మధ్య హత్యాకాండ, దాడులు జరుగుతున్నా మోదీ తాజా మన్ కీ బాత్ లో ఆ ప్రస్తావన కూడా తీసుకు రాలేదు. అమిత్ షా స్వయంగా మణిపూర్ లో పర్యటించి వచ్చినా ఏ ప్రయోజనమూ కనిపించలేదు. శాంతి కలికానికి కూడా కనిపించడం లేదు. జనానికి సంబంధించిన ఏ అంశాన్ని ప్రస్తావించకపోయినా తన అమెరికా పర్యటనకు ప్రజల ఆశీస్సులు కోరడం మాత్రం మోదీ మరిచిపోలేదు. ఇలా కోరడం బహుశా మొదటి సారి కావొచ్చు. సాధారణంగా తన మన్ కీ బాత్ ఆఖరి ఆదివారం ప్రసారం కావలసి ఉన్నా అమెరికాకు వెళ్లాల్సి ఉన్నందువల్ల ముందే మనసులో మాట చెబుతున్నానని మోదీ అన్నారు. ఈ మన్ కీ బాత్ లో ఆయన 48 ఏళ్ల కిందటి ఎమర్జెన్సీని ప్రస్తావించి ప్రజలకు ఆ దుర్దినాలను గుర్తు చేయడం మాత్రం మరిచిపోలేదు. ఈ మధ్య కాలంలో కాంగ్రెస్ నుంచి భారీ సవాళ్లు ఎదురవుతున్నందువల్ల ఆ పార్టీ మీద విరుచుకు పడడానికి మన్ కీ బాత్ ను ఎంచుకున్నారు. ఇప్పుడున్న దేశ జనాభాలో సగం మందికి కూడా ఎమర్జెన్సీ నాటి దుర్దినాలు ప్రత్యక్ష అనుభవంలోనివి కావు. ఇప్పుడూ ఎమర్జెన్సీ నాటి పరిస్థితులే ఉన్నాయన్న వాస్తవాన్ని మోదీ ససేమిరా అంగీకరించరు. ఇందిరాగాంధీ రాజ్యాంగంలో ఉన్న వెసులుబాట్లను ఉపయోగించుకునే ఎమర్జెన్సీ విధించారు. నిరంకుశ పాలన కొనసాగించారు. దానికి ఆమె తగిన శిక్షే అనుభవించారు. అయితే తన నిరంకుశత్వాన్ని తానే రద్దు చేసుకున్న నియంత ఇందిరా గాంధీ ఒక్కరే. ప్రపంచంలో ఎక్కడా ఏ నిరంకుశ పాలకుడు స్వయంగా నిరంకుశత్వాన్ని విడనాడలేదు. మోదీ హయాంలో మరీ ముఖ్యంగా 2019లో రెండో సారి అధికారంలోకి వచ్చిన తరవాత ఆయన పూర్తి నియంతగా మారిపోయారు. మంత్రివర్గంలో అమిత్ షా ఒక్కడి పేరే అనునిత్యం వినిపిస్తుంది. మహా అయితే ఫలానా వారు ఫలాన శాఖ మంత్రి అని ఇద్దరు ముగ్గురు మంత్రుల గురించి మాత్రమే చెప్పగలం. మిగతా వారందరూ నస్మరంతిగాళ్లుగానే మిగిలిపోయారు. నిరంకుశత్వానికి ఇంతకన్నా పెద్ద ఉదాహరణ అనవసరం. సకల వ్యవహారాలూ మోదీ చుట్టే తిరుగుతాయి. అడపాదడపా అమిత్ షా ప్రస్తావన వస్తూ ఉంటుంది. నిజానికి వారిద్దరూ ప్రభుత్వం, పరిపాలనకు సంబంధించి కవలల్లాంటి వారే. మోదీ తాను వచ్చిన సంఘ్ పరివార్ కుదురు లోని నాయకులనే లెక్క చేయని స్థితికి వచ్చేశారు. ఇప్పుడు ఆర్.ఎస్.ఎస్. తన రాజకీయ అంగమైన బీజేపీని నడిపించడం లేదు. అలా నడిపించడం గొప్ప అని కాదు గానీ మోదీ తన మాతృ సంస్థను ఖాతరు చేయడం లేదన్నది మాత్రం వాస్తవం. మోదీ మౌనం వహించింది ఒక్క మణిపూర్ విషయంలోనే కాదు దాదాపు 40 రోజులు మన దేశ కీర్తి పతాకాన్ని ఎగురవేసి దేశ గౌరవాన్ని నలు దిశలా చాటిన మహిళా మల్ల యోధులు జంతర్ మంతర్ లో నిరసన తెలియజేసినా ఆయన నోరు విప్పి ఇంతవరకు ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఈ విషయంలో రెండు విధాలుగా మోదీ వ్యూహం సఫలం అయింది. మొదటిది మహిళా మల్ల యోధులను లైంగికంగా వేధించారన్నా ఆరోపణ ఉన్న బీజేపీ ఎంపీ బాహుబలి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ మీద చట్టం చేయి పడకుండా కాపాడగలిగారు. క్రీడా మంత్రి చేత, కడకు అమిత్ షా చేత మాయ మాటలు చెప్పించి మల్ల యోధుల పోరాటం ప్రస్తుతానికైతే సమసి పోయేట్టు చేయగలిగారు. బీజేపీకి చెందిన వారు ఎంత దుర్మార్గానికి పాల్పడ్డా మోదీ వారిని నిర్లజ్జగా కాపాడతారు. అందుకు ఆయన దగ్గర దగ్గర ఉన్న పెద్ద ఆయుధం మౌనం.

నిజానికి ఆర్.ఎస్.ఎస్. అధినేత మోహన్ భగవత్ తప్ప ఆర్.ఎస్.ఎస్. సీనియర్ నాయకుడైన దత్తాత్రేయ హొసబలే లాంటి వారు మోదీ పని తీరును బాహాటంగానే దుయ్యబడ్తున్నారు. ఆర్.ఎస్.ఎస్. అధికార పత్రిక "ఆర్గనైజర్" లోనే మోదీ మీద విమర్శలు గుప్పించారు. స్థానిక స్థాయిలో బలమైన నాయకత్వం లేకుండా, ప్రజలతో సంబంధాలు లేకుండా మోదీ జనాకర్షణ శక్తివల్ల ప్రయోజనం ఉండదని ఆర్గనైజర్ విమర్శించింది. మణిపూర్ లో శాంతి నెలకొనడం అత్యవసరం అని హొసబలే లాంటి వారు అంటున్నారు. నిజానికి ఆర్.ఎస్.ఎస్. నాయకత్వంలో హొసబలే మోదీకి అత్యంత సన్నిహితుడు కానీ ఆయనే ఒక్కొక్కటిగా మోదీపై విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. హొసబలే గత అక్టోబర్ లోనే మోదీ పరిపాలనా పద్ధతిని దుయ్యబట్టడం మొదలు పెట్టారు. ఆర్.ఎస్.ఎస్. అనుబంధ సంస్థ స్వదేశీ జాగరణ్ మంచ్ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ "భారత్ ఆర్థికంగా ప్రపంచ దేశాల్లో ఆరో స్థానంలో ఉన్నప్పటికీ అంతా సవ్యంగా ఉందని చెప్పలేం. దేశంలో ఒక్క శాతం ఉన్న సంపన్నుల చేతిలోనే 20 శాతం సంపద ఉంది. మిగతా 50 శాతం మంది చేతిలో 13 శాతం సంపద కేంద్రీకృతం అయి ఉంది" అని హొసబలే దెప్పిపొడిచారు. మోదీ విషయంలో ఆర్.ఎస్.ఎస్.లోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. సర్ సంఘ్ చాలక్ మోహన్ భగవంత్ కూడా మోదీ తప్ప మరో మార్గం లేదని వాదిస్తుండగ ఇటీవలి కర్నాటక ఎన్నికల్లో బీజేపీ ఘోర పరాజయాన్ని ఆర్.ఎస్.ఎస్.లోని హొసబలే లాంటి వారు వేలెత్తి చూపుతున్నారు. హొసబలే మోహన్ భగవత్ తరవాతి స్థాయి నాయకుడు అన్న మాట ప్రత్యేకంగా గమనించాల్సింది. ఆర్.ఎస్.ఎస్. ప్రధాన కార్యదర్శి కనక ఆయన అభిప్రాయానికి చాలా విలువ ఉంటుంది. ఆయన మాటలు నిరర్థకంగా ఉండి పోవు. గత 45 రోజులుగా మణిపూర్ లో కొనసాగుతున్న హింసకాండపై ఆయన తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. వందల ఏళ్లుగా కలిసి మెలసి ఉంటున్న మణిపూర్ ప్రజలు పరస్పరం కలహించుకోవడం దారుణం అనేంత దాకా హొసబలే వెళ్లారు. ఈ హింసాకాండకు అడ్డుకట్ట వేయడానికి ప్రభుత్వం, పోలీసులు, సైన్యం, కేంద్ర సంస్థలు సాధ్యమైన అన్ని చర్యలూ తీసుకోవాలని హొసబలే కోరుతున్నారు. నిర్వాసితులైన వారికి ఆర్.ఎస్. ఎస్. అండగా ఉంటుందని కూడా చెప్పారు. మణిపూర్ హింసాకాండ వల్ల కనీసం 50,000 మంది నిర్వాసితులయ్యారు. మోదీ స్థానికులతో సంప్రదించనందుకు కూడా హొసబలే అసంతృప్తి వ్యక్తం చేశారు. మెయితీలు బీజేపీకి మద్దతుదార్లు కనక మోదీకి, మణిపూర్ ముఖ్యమంత్రికి ఈ సమస్యకు శాంతియుత పరిష్కారం కుదరడం ఇష్టం లేదన్నది బహిరంగ రహస్యమే. అమిత్‌షా లాంఛనం పూర్తి చేయడానికి మణిపూర్ లో పర్యటించినా ఆయన చిత్త శుద్ధితో చేసిన ప్రయత్నం ఏమీ లేదు. మణిపూర్ ప్రజలైతే మోదీ మీద విపరీతమైన అసంతృప్తి తో ఉన్నారు. వారు ఈ మన్ కీ బాత్ ను బహిష్కరించారు. మార్కెట్లలో ట్రాన్సిస్టర్ రేడియోలను కాళ్లతో తొక్కి ధ్వంసం చేశారు. మోదీ నాయకత్వంలో 2024 ఎన్నికలను ఎదుర్కోలేం అన్న గుసగుసలు కూడా ఆర్.ఎస్.ఎస్. వర్గాల్లో వినిపిస్తున్నాయి.



విద్యార్థుల ఆత్మహత్యలు నివారించలేమా!

గత కొన్ని రోజులుగా, ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవడం వార్తలు, కథనాలు ప్రధాన స్రవంతి మీడియాలో సాధారణమైనాయి. మెడికల్ కాలేజీలు, ఐఐటీల వంటి ప్రీమియర్ ఇన్‌స్టిట్యూట్‌లు, ప్రైవేట్ కాలేజీల నుంచి ఇలాంటి సంఘటనలు నమోదవుతున్నాయి. విద్యాపరమైన ఒత్తిడిని, అధ్యాపకులు, సిబ్బంది, ఇతర విద్యార్థుల వేధింపులు, పరీక్షలలో పేలవమైన పనితీరు వంటివి విద్యార్థులు ఉద్దేశపూర్వకంగా తమ జీవితాలను ముగించడానికి కారణాలు. యువతపై తీవ్ర మానసిక సామాజిక ప్రభావాలు ఉంటున్నాయని ని మానసిక శాస్త్రవేత్తల అధ్యయనాలు చెబుతున్నాయి. ముఖ్యంగా యువత, మహిళలు, రైతులు, అసంఘటిత రంగంలోని కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్న వారిలో ఎక్కువగా ఉన్నారు. నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో వద్ద భారతదేశంలో ప్రమాద మరణాలు ఆత్మహత్యలు నివేదికలో వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత పోలీసు విభాగాలు సేకరించిన డేటా ఆధారంగా దేశంలోని ఆత్మహత్యలపై సమగ్ర డేటా ఉంది. ఏడిఎస్ఐ నివేదిక ప్రకారం, 2017 నుంచి భారతదేశంలో ఆత్మహత్యల సంఖ్య ఆత్మహత్యల రేటు గణనీయంగా పెరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎగ్జామినేషన్ సంస్థ పరీక్షల ఫలితాలను ప్రకటించిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో పదకొండు మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ట్రిపుల్ ఐటి బాసరలో రెండు రోజులలో ఇద్దరు విద్యార్థులు చనిపోయారు, బాచుపల్లి నారాయణ కళాశాలలో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. భారతదేశంలోని ప్రముఖ కళాశాలల్లో ఆత్మహత్యలు జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం సత్వరమే చర్యలు చేపట్టాలి. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)లోని వివిధ క్యాంపస్‌లలో ఈ ఏడాది ఎనిమిది మంది విద్యార్థులు అనుమానాస్పద ఆత్మహత్యల్లో మరణించారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో భారతదేశంలోని ప్రమాద మరణాలు ఆత్మహత్యలు నివేదిక ప్రకారం, భారతదేశంలో 2021లో 13,000 మంది విద్యార్థులు ప్రతిరోజూ 35 కంటే ఎక్కువ మంది చనిపోయారు, 2020లో 12,526 మరణాల నుండి 4.5 శాతం పెరిగింది. 10,732 ఆత్మహత్యలలో 864 "పరీక్షలో వైఫల్యం" కారణంగా ఉన్నాయి. 2021లో విద్యార్థుల ఆత్మహత్యల మరణాల సంఖ్య 4.5 శాతం పెరిగిందని ఎన్ఆర్సీబి తాజా డేటా చూపిస్తుంది. రీజినల్ చైల్డ్ అండ్ అడల్ట్ ఇన్స్టిట్యూట్ డాక్టర్లు తమ నివేదికలో మానసిక ఆరోగ్య సమస్యల వల్ల ఆత్మహత్యలు జరుగుతున్నాయని చెప్తున్నారు. చాలా సార్లు వ్యక్తులు వృత్తిపరమైన సహాయాన్ని అందించే వారిని సంప్రదించలేరు. ఈ విషయలంలో ప్రభుత్వ హెల్ప్‌లైన్‌లు స్వచ్ఛంద సంస్థలు హెల్ప్‌లైన్‌లు చాలా సహాయకారిగా ఉన్నాయి. అవి పూర్తిగా ఉచితం, ఈ విషయంలో సులభంగా యాక్సెస్ చేయగలవు పిల్లలు ఈ ఎమర్జెన్సీ నంబర్‌లను నోట చేసుకోవాలి. ఆత్మహత్యల నివారణకు స్వచ్ఛంద సేవ సంస్థలు సంజీవని స్నేహ ఉన్నాయి, వారి వెబ్‌సైట్‌లో సరైన సమయాలు భాషలు ఉన్నాయి. మానసిక ఒత్తిడి భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవడానికి చాలా వ్యూహాలు ఉన్నాయి. ఒత్తిడిని కలిగించే విషయాలను గుర్తుంచుకుంటే సరైన మార్గాలను కనుగొనవచ్చు. ఆరోగ్యకరమైన నిద్ర చక్రం చాలా ముఖ్యమైన విషయం. అధిక ఒత్తిడి, ఆందోళన తగ్గించుకొనేందుకు వ్యాయామాలు ఉన్నాయి,

విద్యాపరమైన ఒత్తిడి: తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం నుండి అధిక అంచనాలు అధిక ఒత్తిడికి పరీక్షలలో బాగా రాణించాలనే ఒత్తిడికి దారితీస్తాయి. డిప్రెషన్, యాంగ్జయిటీ, బైపోలార్ డిజార్డర్ వంటి మానసిక ఆరోగ్య సమస్యలు విద్యార్థుల ఆత్మహత్యలకు దోహదం చేస్తాయి. ఒత్తిడి, ఒంటరితనం మద్దతు లేకపోవడం వల్ల ఈ పరిస్థితి మరింత తీవ్రమవుతాయి.

ఆర్థిక ఆందోళనలు: ట్యూషన్ ఫీజులు లేదా జీవన వ్యయాలను భరించలేకపోవడం వంటి ఆర్థిక ఇబ్బందులు విద్యార్థులకు తీవ్ర ఒత్తిడిని ఆందోళనను కలిగిస్తాయి. ఇది నిస్సహాయత, నిరాశ భావాలకు దారి తీస్తుంది. మత్తుపదార్థాలు, మద్యం వినియోగం విద్యార్థుల ఆత్మహత్యలకు దోహదపడతాయి.

– ఎం.సురేష్‌బాబు

బీజేపీ అజెండాను ముందుకు తెచ్చిన లా కమిషన్

సత్య

ఏక రూప పౌరస్మృతి గురించి ఆసక్తి ఉన్న వారు నోటిఫికేషన్ జారీ చేసిన జూన్ 14వ తేదీ నుంచి నెల రోజుల్లోగా తమ అభిప్రాయాలను తెలపాలంటూ ఇరవై రెండవ లా కమిషన్ ఒక ప్రకటన చేసింది. అది లేకపోతే దేశం ఇంకేమాత్రం ముందుకు పోదు, తీవ్ర ఆటంకంగా ఉందన్నట్లు కొందరు గుండెలు బాదుకుంటున్నారు. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల్లో పేర్కొన్నదే కదా దాన్ని అమలు చేస్తామంటుంటే ఎందుకు లేనిపోని దురుద్దేశాలు అంటగడుతున్నారు అంటూ అమాయకత్వాన్ని నటిస్తున్నారు. అదే గనుక వాస్తవమైతే నరేంద్రమోదీ తొమ్మిది సంవత్సరాలుగా ఏం చేస్తున్నట్లు? చట్టాన్ని తీసుకువచ్చేందుకు ఎలాంటి ఆటంకాలు లేవు. లా కమిషన్ సరిగ్గా ఇప్పుడు దాన్ని ఎందుకు ముందుకు తీసుకు వచ్చిందన్నది ప్రశ్న. దీని గురించి దాన్ని ఎవరూ సవాలు చేయటం లేదు, విబేధించటమూ లేదు. ఎన్నో తర్జన భర్జనల తరువాత మన దేశంలోని సంక్లిష్ట పరిస్థితుల కారణంగా ఏకాభిప్రాయసాధనతో సాధించాల్సిన అంశంగా పరిగణించి అర్టికల్ 44లో ఇతర అదేశిక సూత్రాలలో దాన్ని చేర్చారు. వాటిని కోర్టులు అమలు జరపలేవని కూడా రాజ్యాంగంలో ఉంది. వాటిలో పని హక్కు, నిరుద్యోగ భృతి వంటి వివాదం లేని వాటిని అమలు జరపటం మీద శ్రద్ధ లేని బీజేపీ వివాదాస్పద ఏకరూప పౌర స్మృతి మీద కేంద్రీకరిస్తున్నది. మతోన్మాదాన్ని, విద్వేషాన్ని రెచ్చగొట్టే మెజారిటీ-మైనారిటీ మత శక్తులు రెచ్చిపోతున్న తరుణంలో అనేక అపోహలు ఉన్న ఈ అంశం ఇప్పుడు తక్షణ అవసరం అంటూ బీజేపీ ముందుకు తెస్తున్నది. మహిళల ఉద్ధరణ అని చెబుతున్నది. నిజానికి దానికి అంత శ్రద్ధ ఉంటే చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ ఎందుకు కల్పించలేదు. ఒక ముసాయిదాను రూపొందించి జనం ముందు ఎందుకు పెట్టలేదు? త్వరలో ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు, తరువాత లోక్‌సభ ఎన్నికలు జరగనున్న తరుణంలో ఇరవై రెండవ లా కమిషన్ ద్వారా ఒక ప్రచార అస్త్రంగా తన అజెండాను ముందుకు తెచ్చింది.

ఏక రూప పౌర స్మృతి ఈ దశలో అవసరమూ కాదు వాంఛనీయమూ కాదని 2018 ఆగస్టులో ఇరవై ఒకటవ లా కమిషన్ విడుదల చేసిన సంప్రదింపుల పత్రంలో స్పష్టంగా పేర్కొన్నది. ఆ పత్రం విడుదల చేసి మూడు సంవత్సరాలు దాటినందున నాటి నోటిఫికేషన్ గడువు ముగిసిందని, వివిధ కోర్టుల ఉత్తర్వులు దీని మీద ఉన్నందున ఈ అంశం మీద కొత్తగా అభిప్రాయాలను సేకరించనున్నట్లు పేర్కొన్నది. అభిప్రాయాలు తప్ప కోర్టు ఉత్తరువులేమీ లేవు. తాజా సేకరణతో ఏమి చేస్తారో చెప్పలేదు. గత కమిషన్ 2016 జూన్ 17 నోటిఫికేషన్ ద్వారా అభిప్రాయాలను సేకరించింది. వాటిని క్రోడీకరించి కుటుంబ చట్ట సంస్కరణలు పేరుతో 185 పేజీల పత్రాన్ని విడుదల చేసింది. ఏక రూప దేశం అంటే



సమరూపత ఉండనవసరం లేదు. మానవహక్కుల అంశంలో ప్రపంచమంతటా ఉన్న వివాదాలు లేని తర్కాలతో మన భిన్నత్వాన్ని సమ్మతింప చేసేందుకు ప్రయత్నాలు చేయాల్సి ఉందని ఆ పత్రం పేర్కొన్నది. వివిధ మతాలకు సంబంధించి పర్సనల్ చట్టాల్లో ఉన్న వివక్ష, అసమానతలను ఎదుర్కొనేందుకు ఇప్పుడున్న కుటుంబ చట్టాలను అవసరమైన మేరకు క్రోడీకరించి, సవరించవచ్చని కూడా పేర్కొన్నది. సుప్రీంకోర్టు తన ముందుకు వచ్చిన వివిధ కేసుల విచారణ సందర్భంగా ఏకరూప పౌర స్మృతి అవసరమని అభిప్రాయపడింది. తాజాగా మార్చి 23వ తేదీన వివిధ పిటీషన్ల మీద తీర్పు చెబుతూ ఇలాంటి పిటీషన్లను ఆమోదించి విచారించటం అంటే అలాంటి చట్టాన్ని తీసుకురావాలని పార్లమెంటును ఆదేశించటమేనని, తామాపని చేయకూడదని ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ ఆధ్వర్యంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. దీని గురించి తాజాగా ఆలోచించాలని, ఏ చర్యలు తీసుకున్నది కోర్టుకు తెలపాలని ప్రభుత్వాన్ని కోరింది. 2022 అక్టోబరులో సుప్రీంకోర్టులో దాఖలైన పిటీషన్లపై ప్రభుత్వం స్పందిస్తూ మత ప్రాతిపదికన ఉన్న వ్యక్తిగత చట్టాలు దేశ ఐక్యతకు భంగం కలిగిస్తున్నట్లు, ఏకరూప పౌర స్మృతిని తీసుకువస్తామని పేర్కొన్నది.

దేశ ఐక్యతకు, సామాజిక సమతుల్యతకు ముప్పు తెస్తున్న అంశాలలో విద్వేష పూరిత ప్రసంగాలు, ఇతర వివాదాస్పద అంశాలు, చట్టాన్ని కొందరు చేతుల్లోకి తీసుకోవటం, వ్యవస్థల దుర్వినియోగం వంటివి నేడు ప్రధానంగా ముందుకు వచ్చాయి. అలాంటి వారి మీద ఫిర్యాదు లేకున్నా కేసులు నమోదు చేయాలని సుప్రీంకోర్టు ఒకటికి రెండుసార్లు చెప్పాల్సి వచ్చింది. దీన్ని మరో విధంగా చెప్పాలంటే అలాంటి ప్రసంగాలు చేసిన వారి మీద కేసు నమోదు చేసిన వారికి భద్రత లేదన్నది స్పష్టం. ఆదేశిక సూత్రాల్లోని పని, విద్య, నిరుద్యోగ భృతి వంటి హక్కులను అమల్లోకి తెస్తే కరోనాలో వలస కార్మికులు దిక్కులేని చావులకు, ఇబ్బందులకు గురయ్యేవారు కాదు. వలస కూలీలు తమ ఉపాధిని దెబ్బతీస్తున్నారని స్థానికులు దాడులకు దిగేవారూ కాదు.రిజర్వేషన్ల కోసం తన్నుకు చచ్చేవారూ కాదు. తాజాగా మణిపూర్ మంటలూ ఉండేవి కాదు, ప్రధాని మోదీ కనిపించటం లేదనే పోస్టర్లూ వెలువడేవి కాదు.

ఏకరూప పౌర స్మృతి అంటే ఎలా ఉంటుందో కేంద్ర ప్రభుత్వం ఒక ముసాయిదా చట్టాన్ని రూపొందించి ఎలాంటి మార్పులు చేసేదీ జనంలో చర్చకు పెడితే దాని గురించి ఉన్న అనేక అపోహలు తొలుగుతాయి. ఏమైనా సరే వెంటనే అమలు జరపాలని కోరుతున్న మోదీ సర్కార్ గత తొమ్మిది సంవత్సరాలుగా అలాంటిదేమీ తీసుకురాలేదు. రూపు రేఖలు లేని ఒక ప్రతిపాదన మీద అభిప్రాయాలు చెప్పమంటే ఏమి చెబుతారు? గతంలో చెప్పిన అభిప్రాయాలకు కాలదోషం పట్టిందని వర్తమాన లా కమిషన్ ఏ ప్రాతిపదికన నిర్ధారించింది. అసలది ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంస్థ తప్ప రాజ్యాంగబద్ధమైనది కాదు, ప్రభుత్వం దాని ద్వారా అభిప్రాయసేకరణ జరపమని కోరింది గాని రాజ్యాంగ ఆదేశం లేదు. ఏకరూప పౌర స్మృతిని ముస్లింలు లేదా ఏమతం వారైనా ఎలాంటి హేతుబద్ధత లేకుండా గుడ్డిగా తిరస్కరించనవసరంలేదు, భిన్న అభిప్రాయం వెల్లడించవచ్చు, ముసాయిదాను ముందుపెడితే వివరణలు కోరవచ్చు.

ఆదేశిక సూత్రాల్లో అనేక అంశాలు ఉన్నప్పటికీ మిగతావాటిని అమలు జరపకుండా ఏకరూప పౌర స్మృతి మీద బిజెపి కేంద్రీకరణ అన్నది ముస్లింలను లక్ష్యంగా చేసుకున్నారని ఆ మతానికి చెందినవారితో పాటు ఇతర మతాల వారు, మతం, కుల పట్టింపులు లేనివారు కూడా బలంగా నమ్ముతున్నారు. దాన్ని ఏకాభిప్రాయంతో సాధించాల్సి ఉందని అంబేద్కర్‌తో సహా మెజారిటీ భావించిన కారణంగానే ఆదేశిక సూత్రాల్లో చేర్చారు. దళితులు, గిరిజనులకు రిజర్వేషన్లు పది సంవత్సరాలు చాలని నాడు భావించారు. ఆ లక్ష్యం నెరవేర లేదు గనుక పొడిగిస్తూ వస్తున్నారు. తరువాత ఓబిసిలకూ వర్తింప చేశారు. పౌర స్మృతి మీద ఇప్పటికీ ఏకాభిప్రాయ పరిస్థితి ఉందా అంటే లేదు. అసలు హిందువులందరూ దానితో ఏకీభవిస్తారా అన్నది ప్రశ్న. కర్నాటకలో ఎక్కువగా ఉన్న లింగాయతుల తమను ప్రత్యేక మతానికి చెందిన వారిగా పరిగణించాలని డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. శైవులు, వైష్ణవులు వారిలో కులాల వారీ భిన్న ఆచారాలు, ఇలా ఎన్నో విభిన్నతలు ఉన్నాయి. వాటన్నింటిలో బీజేపీ లేదా కేంద్ర ప్రభుత్వం వేలు బెట్టాలని, ఫలానా పద్ధతి పాటించాలని ఆదేశించాలని చూస్తున్నదా? అందుకే ముసాయిదా చట్టాన్ని ముందుపెడితే ఇలాంటి అనుమానాలకు తెరపడుతుంది లేదా కొత్త అంశాలు ముందుకు రావచ్చు.

గోప్యతా హక్కు హాంబక్కు

ఐ-మెయిల్

ప్రజలకు కరోనా టీకా అందించడానికి ఉపయోగించిన కోవిన్ యాప్ నుండి వ్యక్తుల వివరాలన్నీ లీక్ అయ్యి టెలిగ్రామ్ యాప్‌లో ప్రత్యక్షమయ్యాయన్నది నడుస్తోన్న వివాదం. అధికారిక ఖాతా నుండే ఇలా వివరాలు బజారులోకి ప్రవహిస్తే సమాచార గోప్యతకు, డాటా రక్షణకు పూచీ ఏమిటన్నది అందరి ఆందోళన.' అలా కోవిన్ ద్వారా లీక్ కాలేదు... ఆ వివరాలన్నవి ముందే లీక్ అయి ఉండొచ్చన్నది ప్రభుత్వ వివరణ. ఎలా అయినా సరే ఒకటి మాత్రం నిజం. ప్రస్తుత అంతర్జాల యుగంలో సైబర్ స్పేస్‌లో డాటాకి ఎలాంటి భద్రతా లేదు. ఒక ప్లాట్‌ఫామ్ కాకపోతే మరొకటి. ప్రభుత్వానిది కాకపోతే ప్రయివేట్‌ది. ఎలాగోలా వ్యక్తిగత సమాచారం అన్నది రక్షణ,భద్రత లేనిది. ఒకసారి సైబర్ స్పేస్‌లోకి లోకి వెళ్లిన సమాచారం వీధిలో ఉన్నట్టే. అయితే అలా జరగకుండా ఉండడానికి ప్రభుత్వం చెయ్యవలసినదంతా చెయ్యాలి. అనుమతి లేకుండా, ఒకరి సమాచారం వీధిలో పెడితే బాధ్యులను శిక్షించాలి. నియమాలు కఠినతరం చెయ్యాలి. ఆ దిశగా ప్రయత్నాలు వేగంగా జరగడం లేదన్నదే ఆందోళన.

2017లో సుప్రీంకోర్టు వ్యక్తిగత సమాచారం గోప్యంగా ఉంచుకోవడం పౌరుల ప్రాథమిక హక్కుగా గుర్తించింది. అంటే ఆ హక్కుని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఆ తీర్పు స్ఫూర్తితో డాటా పరిరక్షణ చట్టం ఇప్పటికే అమలులో ఉండాల్సింది. అయితే అలా జరగలేదు. ఐదు, సంవత్సరాలు గడుస్తున్నా సంబంధిత బిల్లు పార్లమెంట్ మెట్లెక్కలేదు. ఈలోగా జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. అయినదానికీ, కానిదానికీ వ్యక్తుల వివరాలన్నీ వివిధ సంస్థలు సేకరిస్తున్నాయి. వాటిని జాగ్రత్తపరిచే బాధ్యత, భయం ఆ సంస్థలకు లేదు. దుర్వినియోగం చేసినా ఏమీ చెయ్యలేని స్థితి లేదా చిన్నచిన్న శిక్షలు జరిమానాలతో సరి. ఇప్పుడున్న స్థితిలో అంతర్జాతీయ సంస్థలు తప్పుచేసినప్పుడు కట్టడి చెయ్యడం అసాధ్యం. కాబట్టి డాటా పరిరక్షణ చట్టం వెంటనే పట్టాలకెక్కాలి. యూరోప్ దేశాలు మంచి పకడ్బందీ చట్టాన్ని అమలు చేస్తున్నాయి.వాటన్నిటినీ పరిశీలించి మనదేశం కూడా సమర్థవంతమైన వ్యవస్థను ఏర్పరుచుకోవాలి. అన్ని లావాదేవీలకు, వ్యవహారాలకు సైబర్ స్పేస్ కీలకమైనవేళ, అది సురక్షితంగా ఉంచాల్సిన అవసరం ఉంది. లేదంటే ప్రమాదం.

– డా.డి.వి.జి.శంకరరావు, మాజీ ఎంపీ

బొమ్మలు అందం- బతుకు భారం

చిట్టి మోహన్

అల్లూరి సీతారామరాజు జిల్లాలో లక్క బొమ్మలు తయారు చేసే గిరిజన కార్మికుల బతుకులు అగమ్య గోచరంగా మారాయి. ఇంటి అలంకరణలో ఓ అందాన్ని సంతరించుకొని చూసేవారికి ఆనందాన్ని కలుగజేసే లక్క బొమ్మల తయారీ వెనక ఎంత కష్టం దాగుందో వాటిని రూపొందించే కార్మికుల బతుకులో కూడా అంతే కష్టం దాగి ఉంది. జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రం అరకులోయ మండలంలోని చొంపి గ్రామంలో గిరిజన కార్మికులు గత కొన్ని ఏళ్లుగా లక్క బొమ్మలను తయారుచేస్తూ ఉన్నారు. ఈ బొమ్మలకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పర్యాటక ప్రాంతాల్లోనే కాకుండా ఇతర రాష్ట్రాల సందర్శనీయ ప్రాంతాల్లో కూడా మంచి గిరాకీ ఉంది. కానీ తయారు చేసే కార్మికులు గిట్టుబాటు ధర నోచుకోక, కష్టానికి తగ్గ ప్రతిఫలం దక్కక, కడుపునిండా తిండి లేక కార్మికులు దీనమైన పరిస్థితిలో కాలం గడుపుతున్నారు.

లక్క బొమ్మల తయారీలో ఉన్న కష్టం అంతా ఇంతా కాదని అయినప్పటికీ తమ బతుకులు మాత్రం భారంగా మారుతున్నాయని లక్కబొమ్మల తయారీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ బొమ్మల తయారీకి పడుతున్న కష్టాన్ని వారు వివరించారు. అరకులోయ సమీపంలో వున్న మాడగడ వెళ్లి అక్కడ కొండ కుమర్ల వద్ద వివిధ ఆకృతులతో రూపొందించిన బొమ్మలు కొనుగోలు చేసి వాటిని అలంకరణకు లక్కను కూడా కొనుగోలుచేసి ఆకర్షణీయంగా ఉండేందుకు ఇతర రసాయన పదార్థాలను జతచేసి ఇంట్లో కుంపటిని వెలిగించి బొమ్మ ఆకారం దెబ్బతినకుండా నిప్పుల కొలిమిలో వేడి చేస్తూ, చల్లారుస్తూ బొమ్మలు తయారు

చొంపి గ్రామంలో లక్క బొమ్మ తయారీ కార్మికురాలు కమిడి సుందరమ్మ

చేస్తామని ఇంత కష్టపడుతున్న కూలి డబ్బులు తప్ప లాభం ఏనాడు చూసి ఎరగమని లక్కబొమ్మల తయారీ కార్మికులు వాపోతున్నారు. తాము తయారు చేసే బొమ్మలు గిరిజన సాంస్కృతిక మ్యూజియం, పద్మావతి గార్డెన్, డుంబ్రిగుడ చాపరాయి జలపాతం, బొర్రా గుహలు, కటికి జలపాతం వంటి సందర్శిత ప్రాంతాలతో పాటు ఇతర దర్శనీయ ప్రాంతాల్లో కూడా తాము తయారుచేసే ఈ లక్కబొమ్మలు అమ్ముతున్నారని, లక్క బొమ్మలు విక్రయించే వ్యాపారుస్తులు బాగుపడుతున్నారే తప్ప తయారు చేసే తమ బతుకులు మాత్రం మారడం లేదని కార్మికులు గగ్గోలు పెడుతున్నారు.

ప్రశంసలే- ప్రోత్సాహం శూన్యం:

అరకులోయ పర్యటనకు వచ్చే కేంద్ర మంత్రులు, రాష్ట్రాల గవర్నర్లు సహా మంత్రులు ఇతర ప్రముఖులను జిల్లా అధికారులు తమ చొంపి గ్రామానికి తీసుకువచ్చి లక్కబొమ్మల తయారీ కేంద్రాన్ని ప్రత్యక్షంగా చూపిస్తారు. ఆకర్షణీయమైన అలంకార ప్రాయమైన లక్క బొమ్మలను చూసి వారు తమపై ప్రశంసలు జల్లు కురిపిస్తారన్నారు. అంతేకాకుండా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తమకు ఆసరా కల్పిస్తామని హామీ ఇచ్చి వెళ్తున్నారని చెప్పారు. వారు అందించే ప్రశంసలకు పొంగిపోయి తాము రెట్టించిన ఉత్సాహంతో మరింతగా కష్టపడి ఎన్నో అందమైన లక్కబొమ్మలకు రూపకల్పన చేస్తున్నామన్నారు. వాటినీ కొనేవారు చూసేవారు ఆనందిస్తున్న వారే తప్ప, తమకు మాత్రం ఆనందం కలగటం లేదన్నారు. తాము మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా ఉండిపోయామని విచారం వ్యక్తం చేస్తున్నారు.

కుటీర పరిశ్రమ స్థాపించి ఆదుకోవాలి:

తాము తయారు చేసే బొమ్మలను చూసి తమను ప్రశంసించే అధికారులు తమకు ప్రభుత్వం తరఫునుంచి అన్ని విధాల ప్రోత్సాహం అందిస్తామని అనేక హామీలు ఇచ్చినట్టు చెప్పారు. పెద్దల హామీకి తగ్గట్టు లక్కబొమ్మలు తయారీకి కుటీర పరిశ్రమ నెలకొల్పి తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు. గతంలో పాడేరు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారులు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు లక్క బొమ్మలు తయారు శిక్షణ కోసం హైదరాబాదు పంపించారని అక్కడ దశల వారీగా శిక్షణ పొంది నైపుణ్యం సాధించినప్పటికీ ప్రభుత్వం నుండి సొంత పరిశ్రమ ఏర్పాటుకు నోచలేక, బ్యాంకు రుణాలు సదుపాయం కల్పించక తాము కేవలం లక్కబొమ్మ తయారీ కొలిమిగానే తప్ప సొంత యజమానులుగా ఎదగలేక పోతున్నామన్నారు. ఇప్పటికైనా పాలకులు అధికారులు తమ కష్టాన్ని గుర్తించి తమ కుటుంబ పోషణకై పడుతున్న కష్టాన్ని తెలుసుకొని తాము సొంత కుటీర పరిశ్రమలను ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని లక్కబొమ్మల తయారీదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

దశాబ్ద కాలంగా లక్కబొమ్మల తయారు చేస్తూ కష్టానికి తగ్గ ప్రతిఫలం దక్కకపోవడంతో యజమానులుగా ఎదగలేక కూలీలుగానే బతుకు బండిని లాగిస్తున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోదా. బొమ్మలు ఇంటికి అలంకారప్రాయం వ్యాపారుల జీవితాలకు వెలుగు మయంగా ఉంటున్నాయి. తయారు చేసే జీవితాలు మాత్రం చీకటి మయం. ప్రశంసలకు తప్ప ఆర్థిక ప్రోత్సాహానికి నోచుకోలేకపోతున్నాము. ఎందరికో రుణ సదుపాయం కల్పించి ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం తమను మాత్రం ఎందుకు ప్రోత్సహించడం లేదు మా బొమ్మలు అందరికీ కావాలి తమ కష్టాన్ని మాత్రం ఈ ప్రభుత్వానికి పట్టదా..? అని ఆవేదన చెందుతున్నారు. చొంపి కార్మికులు తయారు చేసే బొమ్మలు ఎంతో అందంగా ఆకర్షణీయంగా ఉన్నాయి. వాణిజ్య సముదాయంలో వీటి ధర అధికమైన కార్మికులకు ఈ ప్రతిఫలం దక్కకపోవడం విచారకరం ప్రభుత్వం తయారుదారులను ఆదుకోవాలి. ఏళ్ల తరబడి లక్కబొమ్మలను తయారుచేస్తున్న కార్మికులకు కష్టాన్నికి తగ్గ ప్రతిఫలం దక్కక శ్రమ దోపిడీకి గురి అవుతున్నారు. తయారీదారులకు ఎటువంటి ప్రోత్సహం అందడం లేదు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే లక్క బొమ్మల తయారీ కార్మికుల బతుకులు ఛిద్రం అవుతున్నాయి.

‘ద్రోహుల దినం’ పాటించిన ఎన్‌సీపీ శ్రేణులు

శివసేన ఎమ్మెల్యేల తిరుగుబాటు మొదటి వార్షికోత్సవం సందర్భంగా నిరసన

ముంబై: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) నాయకులు, కార్యకర్తలు మంగళవారం ముంబై, మహారాష్ట్రలోని ఇతర ప్రాంతాలలో ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేతో సహా శివసేన శాసన సభ్యులు తిరుగుబాటు చేసిన మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ‘గద్దర్ దిన్’ (ద్రోహుల దినం) పాటించారు. ఎన్‌సీపీ కార్యనిర్వాహక అధ్యక్షురాలు, లోక్‌సభ సభ్యురాలు సుప్రియా సూలే నేతృత్వంలో ముంబైలోని పార్టీ కార్యకర్తలు... తిరుగుబాటు శాసనసభ్యులు రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి డబ్బు తీసుకున్నారని చెప్పడానికి గుర్తుగా ‘ఖోక్’ (కార్టన్‌లు) పట్టుకుని నినాదాలు చేశారు. గత ఏడాది జూన్‌లో ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలో జరిగిన తిరుగుబాటు సేన, ఎన్‌సీపీ, కాంగ్రెస్‌తో కూడిన అప్పటి ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని మహా వికాస్ అఘాడి ప్రభుత్వం పతనానికి దారితీసింది. జూన్ 30, 2022న షిండే ముఖ్యమంత్రి కాగా, బీజేపీకి చెందిన దేవేంద్ర ఫడ్నవీస్ ఉప ముఖ్యమంత్రి అయ్యారు. మంగళవారం, ఎన్‌సీపీ కార్యకర్తలు సూలేతో కలిసి దక్షిణ ముంబైలోని తమ పార్టీ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. తిరుగుబాటు శాసనసభ్యులు ఒక్కొక్కరు రూ.50 కోట్లు లంచంగా తీసుకున్నారని ఆరోపిస్తూ సూలే, ఇతరులు ‘పన్నాస్ (50) ఖోక్, ఏక్దమ్ సరే’ అంటూ నినాదాలు చేశారు. ముఖ్యమంత్రి షిండే సొంత పట్టణమైన పొరుగున ఉన్న థానేలో ఎన్‌సీపీ నాయకుడు, మాజీ మంత్రి జితేంద్ర అవద్ ఇదే విధమైన నిరసనకు నాయకత్వం వహించారు. ఎన్‌సీపీ కార్యకర్తలు ‘పన్నాస్ ఖోక్, ఏక్దమ్ ఓకే’ స్టిక్కర్‌లతో కూడిన అనేక కార్టన్‌లను ఒక ప్రదేశంలో పోగు చేసి, నిరసనగా వాటిని తగులబెట్టారు. ఎన్‌సీపీ కార్యకర్తలు నాగ్‌పూర్‌లోని వెరైటీ స్క్వేర్ వద్ద ప్రదర్శన నిర్వహించారు. షిండే నేతృత్వంలోని శివసేన శాసనసభ్యులకు వ్యతిరేకంగా ‘ఖోకే సర్కార్ ముర్దాబాద్, గద్దర్ ఆమ్దార్ ముర్దాబాద్’ వంటి నినాదాలు చేశారు. ముఖ్యంగా, శివసేన (యూబీటీ) నాయకుడు సంజయ్ రౌత్ ఐక్యరాజ్య సమితికి లేఖ రాస్తూ, షిండేతో సహా 40 మంది శివసేన ఎమ్మెల్యేలు తమ పార్టీ అధినేత ఉద్ధవ్ థాకరేని ‘వదిలినందుకు’ గుర్తుగా జూన్ 20ని ‘ప్రపంచ దేశద్రోహుల దినోత్సవం’ గా ప్రకటించాలని కోరారు. మహారాష్ట్ర ఎన్‌సీపీ అధ్యక్షుడు జయంత్ పాటిల్ గత వారం శివసేన తిరుగుబాటు శాసనసభ్యులకు వ్యతిరేకంగా నిరసన తెలియజేయాలని పార్టీ కార్యకర్తలను కోరారు. ‘ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ప్రతీకాత్మకమైన ‘ఖోక్’ (డబ్బుల పెట్టెలు) ప్రదర్శించడం ద్వారా ఎన్‌సీపీ కార్యకర్తలు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో నిరసనలు నిర్వహించాలని ఆయన శనివారం పిలుపునిచ్చారు. ఎన్నికల సంఘం నిజమైన శివసేనగా గుర్తించిన షిండే శిబిరంలోని తాత్కాలిక ఆనందం క్షీణిస్తోందని, ప్రభుత్వంలో వారి రోజులు లెక్కించబడుతున్నాయని ప్రజలకు చెప్పాలని పాటిల్ ఎన్‌సీపీ కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. శరద్ పవార్ నేతృత్వంలోని పార్టీ గతంలో మహారాష్ట్రలో రాజకీయ సంక్షోభంపై సుప్రీం కోర్టు తీర్పును వివరిస్తూ బహిరంగ సభలను ఏర్పాటు చేసింది. 2022 జూన్ 30న అప్పటి మహారాష్ట్ర గవర్నర్ భగత్ సింగ్ కోశ్యారీ అసెంబ్లీలో మెజారిటీని నిరూపించుకోవాల్సిందిగా అప్పటి ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాకరేను పిలవడం సమంజసం కాదని సుప్రీం కోర్టు గత నెలలో తీర్పునిచ్చింది. థాకరే ప్రభుత్వాన్ని పునరుద్ధరించలేమని రాజ్యాంగ ధర్మాసనం కూడా పేర్కొంది. అయితే అతను సభలో బలపరీక్ష ఎదుర్కోకుండానే రాజీనామా చేశారు.

కర్నాటకలో ముదిరిన ‘బియ్యం’ వివాదం

కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీ నిరసనలు

బొమ్మైతో సహా కొందరి అరెస్టు

బెంగళూరు: కర్నాటకలో బియ్యం సరఫరాపై రాజకీయ వివాదం ముదిరింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అన్నభాగ్య పథకం అమలును అడ్డుకుంటోందని రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విమర్శించింది. దీంతో బీజేపీ, కాంగ్రెస్ మధ్య పరస్పరం నిందారోపణలు కొనసాగుతున్నాయి. రాష్ట్రంలో ఈ రెండు పార్టీలు మంగళవారం పోటాపోటీ నిరసనలు చేపట్టాయి. భారీ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ప్రదర్శనలు నిర్వహించాయి. కేంద్రప్రభుత్వ తీరుకు నిరసనగా అన్ని జిల్లా కేంద్రాల్లో కాంగ్రెస్ అధ్వర్యంలో ఆందోళనలు జరిగాయి. బీపీఎల్ కుటుంబాల్లోని ప్రతి ఒక్కరికి 10కిలోల బియ్యం ఇవ్వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందంటూ బీజేపీ కొన్ని చోట్ల ధర్నాలు నిర్వహించింది. ఈ క్రమంలో మాజీ సీఎం బసవరాజ్ బొమ్మైతో పాటు కొందరు బీజేపీ సీనియర్లు అరెస్టు అయ్యారు. రాష్ట్ర రాజధాని బెంగళూరులో భారీ వర్షంలోనే కాంగ్రెస్ నేతలు ఆందోళన నిర్వహించగా ఉపముఖ్యమంత్రి, కాంగ్రెస్ రాష్ట్రఅధ్యక్షుడు డీకే శివకుమార్ నిరసనకారులను ద్దేశించి ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఎన్నికల హామీలో భాగంగా అన్నభాగ్య పథకాన్ని అమలు చేయలని చూస్తుంటే దానిని నీరుగార్చేందుకు కేంద్రప్రభుత్వం యత్నిస్తుందని ఆరోపించారు. కేంద్రంలో ఉన్నది పేదల వ్యతిరేక ప్రభుత్వమని విమర్శించారు. ఇచ్చిన హామీ మేరకు బియ్యాన్ని సరఫరా చేసేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నట్లు శివకుమార్ తెలిపారు. కాగా, ఫుడ్ కార్పొరేషన్, సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్, నాఫెడ్ వంటి కేంద్ర సంస్థల నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు కర్నాటక మంత్రి ఇటీవల తెలిపారు. అయితే బహిరంగ మార్కెట్ విక్రయ పథకం (ఓఎంఎస్ఎస్) కింద రాష్ట్ర ప్రభుత్వాలకు సెంట్రల్ పూల్ కింద బియ్యం, గోధుమల విక్రయాలను కేంద్రం నిలిపివేసింది. ఈశాన్య రాష్ట్రాలు, గిరి రాష్ట్రాలకు, శాంతి భద్రతల సమస్యలు, ప్రకృతి విపత్తులతో బాధపడే రాష్ట్రాలకు తప్ప మిగతా రాష్ట్రాలకు విక్రయాలు ఆపేసినట్లు ఎఫ్‌సీఐ ఒక ప్రకటన చేసింది.

పూణే సహకార బ్యాంకు కుంభకోణంలో మరో వ్యక్తి అరెస్టు

న్యూఢిల్లీ: సహకార బ్యాంకులో రూ.429 కోట్ల రూపాయల ప్రజా ధనం దుర్వినియోగ ఆరోపణలకు సంబంధించి మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా మరో వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మంగళవారం తెలిపింది. పూణేలోని సేవా వికాస్ కో-ఆపరేటివ్ బ్యాంక్ మోసం కేసు విచారణలో భాగంగా నిందితుడు, సాగర్ మారుతీ సూర్యవంశీని జూన్ 15న మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ) క్రిమినల్ సెక్షన్ల కింద కస్టడీలోకి తీసుకున్నారు. ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టు ఆయనను జూన్ 26 వరకు ఈడీ కస్టడీకి పంపింది. “సాగర్ సూర్యవంశీ, అతని బంధువులు 10 ఎన్‌పీఏ(నిరర్థక ఆస్తులు) రుణ ఖాతాలలో బ్యాంకును రూ.60.67 కోట్ల మేర మోసగించినట్లు తేలింది. అతను అమర్ ముల్చందానీ (బ్యాంకు మాజీ చైర్మన్)తో స్నేహపూర్వంగా వ్యవహరించి తగినంత రుణ యోగ్యత, తిరిగి చెల్లించే సామర్థ్యం లేకుండానే రుణాలు పొందారు” అని దర్యాప్తు సంస్థ పేర్కొంది. జనవరి 27న బ్యాంక్ మాజీ చైర్మన్‌పై నిర్వహించిన ఈడీ దాడిని అడ్డుకున్నందుకు ,సాక్ష్యాలను ధ్వంసం చేసినందుకు మహారాష్ట్ర పోలీసులు ముల్చందానీ, అతని ఐదుగురు కుటుంబ సభ్యులను అరెస్టు చేశారు. సేవా వికాస్ కో-ఆపరేటివ్ బ్యాంక్‌లో రూ. 429 కోట్లు దుర్వినియోగమయ్యాయని, తద్వారా వేలాది చిన్న డిపాజిటర్లకు నష్టం జరిగిందని వారి నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లలో పేర్కొన్నారు. ఎటువంటి బ్యాంకింగ్ నిబంధనలను పాటించకుండా అమర్ ముల్చందానీ కుటుంబమే యాజమాన్యంగా వ్యవహరిస్తూ బ్యాంకును నడుపుతోందని, అడ్డగోలుగా రుణాలు మంజూరు చేయబడ్డాయని ఈడీ పేర్కొంది.

92 శాతం కంటే ఎక్కువ రుణ ఖాతాలు ఎన్‌పీఏలు మారడంతో చివరికి బ్యాంక్ పతనానికి దారితీసింది. ఆ తరువాత ఆర్బీఐ దాని లైసెన్స్‌ను రద్దు చేసింది. ఈ కేసులో ఇప్పటి వరకు 122.35 కోట్ల రూపాయల విలువైన ఆస్తులను తాత్కాలికంగా అటాచ్ చేసినట్లు ఈడీ తెలిపింది.

ఎన్నికలు హింసకు లైసెన్స్ కాదు

కేంద్ర బలగాల మోహరింపుపై బెంగాల్ సర్కార్ పిటిషన్ తిరస్కరించిన సుప్రీం

న్యూఢిల్లీ : జులై 8 పంచాయతీ ఎన్నికల కోసం పశ్చిమ బెంగాల్ అంతటా కేంద్ర బలగాలను మోహరించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను ఆదేశించిన కలకత్తా హైకోర్టు ఆదేశాలపై జోక్యం చేసుకోవడానికి సుప్రీం కోర్టు మంగళవారం నిరాకరించింది. ఎన్నికలు నిర్వహించడం ‘హింసకు లైసెన్స్’ కాదని పేర్కొంది. హైకోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) దాఖలు చేసిన పిటిషన్‌లను కొట్టివేసిన అత్యున్నత న్యాయస్థానం, చివరకు రాష్ట్రంలో స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా చూడడమే హైకోర్టు ఆదేశాలు అని స్పష్టం చేసింది. ‘ఎన్నికలు నిర్వహించడం హింసకు లైసెన్స్ కాదు’ అని న్యాయమూర్తులు జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన వెకేషన్ బెంచ్ విచారణ సందర్భంగా పేర్కొంది. ‘పశ్చిమ బెంగాల్ రాష్ట్రం మొత్తం ఒకే తేదీన స్థానిక సంస్థలకు ఎన్నికలను నిర్వహిస్తున్నందున అంతిమంగా రాష్ట్రవ్యాప్తంగా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా చూడాలనేది హైకోర్టు ఆదేశం వాస్తవం. ఎన్నికలకు వెళ్లే సీట్ల సంఖ్యకు సంబంధించి...’ అని ధర్మాసనం స్పష్టం చేసింది. హైకోర్టు ఆదేశం ఎటువంటి జోక్యాన్ని కోరదని, ఈ విషయంలో హైకోర్టు జారీ చేసిన ఇతర ఆదేశాలపై జోక్యం చేసుకునేందుకు అత్యున్నత న్యాయస్థానం మొగ్గు చూపదని పేర్కొంది. పశ్చిమ బెంగాల్‌లోని అన్ని జిల్లాలకు కేంద్ర బలగాలను అభ్యర్థించడం, మోహరించడం కోసం హైకోర్టు ఆదేశాల్లో సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవాలని రాష్ట్రం, ఎస్ఈసీ తరపు న్యాయవాదులు వాదించారని సుప్రీం ధర్మాసనం తెలిపింది. ఎన్నికల నిర్వహణ కోసం కేంద్ర బలగాల మోహరింపును కోరడం కమిషన్ అధికార పరిధిలో లేదని ఎస్ఈసీ తరపు న్యాయవాది తెలిపారు. విచారణ సందర్భంగా, హింసతో పాటు ఎన్నికలు జరగవని ధర్మాసనం పేర్కొంది. ప్రజలు వెళ్లి నామినేషన్లు దాఖలు చేయలేకపోతే లేదా నామినేషన్లు దాఖలు చేసిన వారు అంతిమంగా ముగిసిపోతే లేదా గ్రూపు గొడవలు ఉంటే, అప్పుడు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు ఎక్కడ ఉన్నాయని వ్యాఖ్యానించింది. రాష్ట్రం తరపున హాజరయిన న్యాయవాది కొన్నిసార్లు, వాస్తవాలు, గణాంకాలు ముద్రలకు భిన్నంగా ఉంటాయని తెలిపింది. 48 గంటల్లో పంచాయతీ ఎన్నికల కోసం పశ్చిమ బెంగాల్ అంతటా కేంద్ర బలగాలను కోరాలని, మోహరించాలని జూన్ 15న హైకోర్టు ఆదేశించింది. ఎన్నికల ప్రక్రియ కోసం సున్నిత ప్రాంతాల్లో కేంద్ర బలగాలను మోహరించాలని జూన్ 13న ఆదేశాలు జారీ చేసినప్పటి నుంచి ఎలాంటి చర్యలు తీసుకోలేదని కోర్టు పేర్కొంది. జులై 8న జరగనున్న పంచాయతీ ఎన్నికలకు నామినేషన్ల దాఖలుపై హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్న రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు కేంద్ర బలగాలను మోహరించాలని ఎస్ఈసీని కోరాలని హైకోర్టు ఆదేశించింది. శాంతిభద్రతల దృక్కోణం నుంచి సున్నితమైన ప్రాంతాలను గుర్తించడానికి ఇప్పటి వరకు ఎటువంటి ప్రభావవంతమైన చర్యలు తీసుకోలేదని, అలా చేయడానికి మరో రెండు రోజులు పట్టవచ్చని ఎస్ఈసీ సమర్పించిన నేపథ్యంలో ‘ఇక ఎక్కువసేపు వేచి ఉండటం పరిస్థితికి మరింత నష్టం కలిగిస్తుంది. ఎన్నికల ప్రక్రియ స్వచ్ఛతను రక్షించడంలో సహాయం చేయదు’ అని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. అవసరమైన సంఖ్యలో కేంద్ర బలగాలను మోహరించాలని, దానికి అయ్యే ఖర్చును కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందని, దానిలో కొంత భాగాన్ని రాష్ట్రం నుంచి వసూలు చేయరాదని హైకోర్టు కేంద్రాన్ని ఆదేశించింది. 2021లో కోల్‌కతా మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు, 2022లో మునిసిపల్ ఎన్నికల సమయంలో రాష్ట్రంలో పెద్ద ఎత్తున హింస చోటుచేసుకుందని పేర్కొంటూ, శాంతియుత ఎన్నికల కోసం కేంద్ర బలగాలను మోహరించాలని బీజేపీకి చెందిన సువేందు అధికారి, కాంగ్రెస్ ఎంపీ అధిర్ రంజన్ చౌదరితో సహా ప్రతిపక్ష నాయకులు కోర్టులో పిటిషన్ వేశారు. ఇచ్చిన సమయం సరిపోదని పేర్కొంటూ నామినేషన్ల చివరి తేదీని పొడిగించాలని కూడా వారు అభ్యర్థించారు. వారి అభ్యర్థనను పరిగణనలోకి తీసుకునే బాధ్యతను కోర్టు ఎస్ఈసీకి వదిలివేసింది.

యూపీ, బీహార్‌కు కేంద్ర ఆరోగ్య బృందాలు

వడగాడ్పుల కారణంగా ప్రజారోగ్య చర్యల నిర్వహణ

న్యూఢిల్లీ : దేశంలో తీవ్ర వడగాల్పుల కారణంగా మరణాలు నమోదవుతున్న నేపథ్యంలో వేడి సంబంధిత అనారోగ్యాలను పరిష్కరించడానికి ప్రజారోగ్య ప్రతిస్పందన చర్యల నిర్వహణ కోసం కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ నుంచి ఒక నిపుణుల బృందం, అలాగే ఐసీఎంఆర్, ఐఎండీ, ఎన్‌డీఎంఏ నుంచి నిపుణులు ఉత్తర ప్రదేశ్, బీహార్‌ను సందర్శించనున్నారు. దేశవ్యాప్తంగా వేడిమి నుంచి ఉపశమనం కోసం ప్రజారోగ్య సంసిద్ధతకు సంబంధించిన ఉన్నత స్థాయి సమావేశానికి అధ్యక్షత వహించిన కేంద్ర ఆరోగ్య మంత్రి మన్సుఖ్ మాండవియా మంగళవారం ఈ మేరకు ఆదేశించారు. ఈ సమావేశంలో కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి భారతి ప్రవీణ్ పవార్, నీతి ఆయోగ్ సభ్యుడు (ఆరోగ్యం) డాక్టర్ వి.కె.పాల్ కూడా పాల్గొన్నారు. గత కొన్ని రోజులుగా అనేక రాష్ట్రాలు తీవ్రమైన వేడిగాలులను ఎదుర్కొంటున్నాయి. అవగాహన, ముందస్తు చర్యల ద్వారా దృఢమైన, సమయానుకూలమైన సంసిద్ధత ప్రాముఖ్యతను కేంద్ర ఆరోగ్య మంత్రి మాండవియా నొక్కి చెబుతూ, నిర్దిష్ట స్వల్ప, మధ్యస్థ, దీర్ఘకాలిక చర్యలతో ఆరోగ్యంపై వడగాల్పుల ప్రభావాలను ఎలా తగ్గించాలనే దానిపై పరిశోధన చేయాలని భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) ను కూడా ఆదేశించారు. ఎండాకాలానికి ముందు వడదెబ్బ సంబంధిత వ్యాధుల నివారణకు కేంద్రం సకాలంలో చర్యలు చేపట్టిందని ఆరోగ్య మంత్రి తెలిపారు. అయితే ఫిబ్రవరిలో ఆరోగ్య మంత్రిత్వ శాఖ వడగాల్పులకు సంబంధించి... అవసరమైన మందులు, ఇంట్రావీనస్ ఫ్లూయిడ్‌లు, ప్యాక్‌లు, ఓఆర్ఎస్, తాగునీరు, అలాగే అవసరమైన ఐఈసీ సామాగ్రి పంపిణీ, ఆరోగ్య సౌకర్యాల సంసిద్ధతను సమీక్షించాలని రాష్ట్రాలకు సలహా ఇచ్చింది. వేడి సంబంధిత వ్యాధులపై జాతీయ కార్యాచరణ ప్రణాళికను కూడా అన్ని రాష్ట్రాలతో పంచుకున్నారు. సమావేశంలో మాండవియా, వివిధ రాష్ట్రాల్లో వేడిగాలుల స్థితిని, సకాలంలో, సమర్థవంతమైన ఆరోగ్య సంరక్షణ సేవలను అందించడానికి అవసరమైన సామాగ్రి, ఆస్పత్రి మౌలిక సదుపాయాల లభ్యత పరంగా కేంద్ర సంస్థల సంసిద్ధత గురించి వివరించారు. ‘ప్రజల అవగాహన ముఖ్యం, అయితే వేడి సంబంధిత వ్యాధులపై వైద్య అధికారులు, ఆరోగ్య సిబ్బంది, అట్టడుగు స్థాయి కార్మికులకు సున్నితత్వం, సామర్థ్యాన్ని పెంపొందించడం, వారి ముందస్తు గుర్తింపు, నిర్వహణ కూడా ముఖ్యమైనది’ అని మాండవియా చెప్పారు. మల్టీ మీడియా ఐఈసీ ప్రచారాల ద్వారా నివారణ చర్యలకు సంబంధించి ప్రజల్లో అవగాహన పెంచాలని, రాష్ట్రాలు, కేంద్ర సంస్థలను ఆయన కోరారు. మాండవ్య భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ని రోజువారీ వాతావరణ సూచనలను సులభంగా అన్వయించగలిగే, వ్యాప్తి చేసే విధంగా జారీ చేయాలని కోరారు.

1289 సీసాల మద్యం, 51కిలోల డ్రగ్స్ ధ్వంసం

న్యూఢిల్లీ: ఇక్కడి ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ (ఐజీఐ) విమానాశ్రయంలోని కస్టమ్స్ అధికారులు 1,289 మద్యం సీసాలు, 51.68 కిలోల డ్రగ్స్ (41.97 కిలోల హెరాయిన్, 9.71 కిలోల కొకైన్) ను ధ్వంసం చేశారు. 2020 నుండి డిసెంబర్ 2022 వరకు విమానాశ్రయంలోని టెర్మినల్ 3 వద్ద వీటిని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మద్యం బాటిళ్లకు ఎఫ్ఎస్ఎస్ఏఐ (ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా) క్లియరెన్స్ లేనందున వాటిని మార్కెట్‌లో విక్రయించలేమని కస్టమ్స్ అధికారులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

నకిలీ వార్తల వ్యాప్తిపై సిద్ధరామయ్య సీరియస్

కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం

బెంగళూరు: కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వంపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు వార్తలు వ్యాప్తి చేస్తున్నవారిపై చట్టపరంగా కఠిన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మంగళవారం అధికారులను ఆదేశించారు. కర్నాటకలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సామాజిక మాధ్యమాల్లో తప్పుడు వార్తల ప్రచారం హద్దులు దాటిందని, వాటి మూలాల్ని గుర్తించి దాని వెనుక ఉన్న వ్యక్తులను గుర్తించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీఎం కోరారు. ఈ విషయమై హోంమంత్రి జి.పరమేశ్వర్‌తో ముఖ్యమంత్రి ఈరోజు విస్తృతంగా చర్చించినట్లు ఆయన కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. 2013లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నకిలీ వార్తల బెడద ఎక్కువైంది. ఈసారి కూడా అదే వ్యూహాన్ని రాజకీయ ప్రత్యర్థులు అనుసరిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మరిన్ని తప్పుడు వార్తలను వ్యాప్తి చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, సమాజంలో అశాంతి సృష్టిస్తున్నారని పేర్కొంది. అందువల్ల నకిలీ వార్తల మూలాలను ప్రాథమిక దశలోనే గుర్తించి, వాటిని నిర్మూలించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు.‘ఇంతకుముందు, రాజకీయ ప్రత్యర్థులు పిల్లల దొంగలు, గోమాంసం రవాణా చేసేవారి గురించి తప్పుడు వార్తలను ప్రచారం చేయడం ద్వారా సమాజంలో అశాంతిని సృష్టించడానికి ప్రయత్నించారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో, రాష్ట్ర ప్రజలు బీజేపీ, సంఘ్ పరివార్‌లను నిర్ద్వంద్వంగా తిరస్కరించారు” అని సిద్ధరామయ్య పేర్కొన్నారు. “దేశంలో ప్రజాస్వామ్య మనుగడకు అవసరమైన 2024 లోక్‌సభ ఎన్నికలకు మనం సన్నద్ధమవుతున్నాం. కానీ ఇప్పుడు, నకిలీ వార్తలు, పుకార్ల ద్వారా మూక దాడులు, అల్లర్లను ప్రేరేపించే ప్రయత్నాలు జరుగుతాయని స్పష్టమైన సూచనలు ఉన్నాయి. కావున ఈ విషయంలో అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇస్తున్నాం” అని తెలిపారు.

ఉచితంగా ‘గుర్బానీ’ ప్రసారాలు

పంజాబ్ అసెంబ్లీలో బిల్లు ఆమోదం

చండీగఢ్: స్వర్ణ దేవాలయం నుంచి వచ్చే గుర్బానీ ఇక నుంచి ఉచితంగా ప్రసారం అవుతుందని పంజాబ్ సీఎం భగవంత్‌మాన్ సింగ్ తెలిపారు. బ్రిటీష్ కాలం నాటి సిక్కు గురుద్వారాల చట్టాన్ని పంజాబ్ అసెంబ్లీ సవరించింది. గుర్బానీ ప్రసార హక్కుల్ని ఒక ప్రైవేట్ ఛానల్‌కే పరిమితం చేయకుండా ఇప్పుడు శ్లోకాలు అందరికీ ఉచితంగా చేరనున్నాయి. దీని కోసం పంజాబ్ అసెంబ్లీ మంగళవారం సిక్కు గురుద్వారాల సవరణ బిల్లు-2023కి ఆమోదం తెలిపింది. ఇప్పటివరకు అమృత్‌సర్‌లోని స్వర్ణదేవాలయం నుంచి గుర్బానీ ప్రసారం అవుతున్న విషయం తెలిసిందే. టెండర్‌తో పని లేకుండా గుర్బానీ అందరికీ ఉచితంగా ప్రసారం అవుతుందని అసెంబ్లీలో సీఎం భగవంత్‌మాన్ సింగ్ తెలిపారు. బ్రిటీష్ కాలం నాటి సిక్కు గురుద్వారా చట్టం 1925కి ఆప్ ప్రభుత్వం సవరణలు చేసింది. దానికి సోమవారం కేబినెట్ ఆమోదం తెలపగా, మంగళవారం అసెంబ్లీలో ఆ బిల్లును ఆమోదించారు. దీంతో గుర్బానీ ప్రసారాలపై ఉన్న పీటీసీ టీవీ ఛానల్ హక్కుల ఆధిపత్యానికి తెర పడినట్లయింది. సిక్కు మత ప్రచారాకులపై ఉన్న నియంత్రణను సవరణ చట్టం తొలగించనున్నది. సెక్షన్ 125ఏ సవరణ ద్వారా ఇక నుంచి గుర్బానీ ప్రసారాలు ఉచితంగా జరగనున్నాయి. గుర్బానీ అనేది సిక్కుల అత్యం పవిత్ర ంగా భావించే శ్లోకం. స్వర్ణదేవాలయంలో పఠించే ఈ శ్లోకాన్ని ప్రపంచవ్యాప్తంగా ఉన్న సిక్కులు భక్తిశ్రద్ధలతో ఆలకిస్తారు. ఈ శ్లోకం ప్రసార హక్కులు ప్రస్తుతం ఒక ప్రైవేట్ ఛానల్ దగ్గర మాత్రమే ఉన్నాయి. ఈ ప్రసార హక్కులను ఒక ఛానల్‌కే పరిమితం చేయకుండా అందరికీ అందుబాటులో ఉండేలా ఉచితంగా ప్రసారం చేయాలని పంజాబ్ సర్కారు నిర్ణయించింది.

మోదీ హయాంలో ప్రభుత్వ శాఖల్లో ఖాళీలు రెట్టింపు: కాంగ్రెస్

న్యూఢిల్లీ: మోదీ హయాంలో కేంద్రప్రభుత్వ శాఖల్లో ఖాళీలు రెట్టింపు అయినట్లు కాంగ్రెస్ పేర్కొంది. 2014 నుంచి ఖాళీల భర్తీకి కేంద్రప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వలేదని, దీంతో ఖాళీ పోస్టులు ప్రస్తుతం 30లక్షలకు పెరిగాయని విమర్శించింది. దళితులు, గిరిజనులు, బీసీలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు మోదీ ప్రభుత్వం వ్యతిరేకమని, అందుకే ఖాళీలను భర్తీ చేయడం లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే ఆరోపించారు. మంజూరైన పోస్టుల సంఖ్య, ఉన్న ఖాళీల వివరాలను వెల్లడించారు. 2014లో 11.57శాతం ఖాళీలు ఉంటే 2022 నాటికి 24.3శాతానికి పెరిగినట్లు తెలిపారు. ఖాళీలను భర్తీ చేసేందుకు మోదీ ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వలేదని, 30లక్షల ఉద్యోగాలు ప్రభుత్వ శాఖల్లో భర్తీ కావాల్సి ఉన్నట్లు ఖడ్గే ట్వీట్ చేశారు. కొన్ని వేల సంఖ్యలో నియామక పత్రాలను పంపిణీ చేసి యువతను మభ్యపెట్టి వారి మెప్పు పొందాలని మోదీ ప్రభుత్వం భావిస్తోందని వ్యాఖ్యానించారు. అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీ మేరకు దేశంలోని యువత కోసం ఉద్యోగావకాశాలను సృష్టించడంలో విఫలమైనట్లు మోదీ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ దుయ్యబట్టింది.

ఆర్డినెన్స్‌పై కాంగ్రెస్ వైఖరేమిటో: కేజ్రీవాల్



న్యూఢిల్లీ: దిల్లీపై పెత్తనం కోసం కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌పై తమ వైఖరిని కాంగ్రెస్ పార్టీ కనీసం ఈనెల 23న పాట్నాలో జరగబోయే ప్రతిపక్షాల సమావేశంలో స్పష్టం చేస్తుందని దిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆకాంక్షించారు. బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఈ సమావేశానికి అధ్యక్షత వహిస్తారు. లోక్‌సభ ఎన్నికల్లో ఏ విధంగా ముందుకెళ్లాలన్న దానిపై సమావేశం చర్చించనుంది. ఇదే క్రమంలో మంగళవారం విలేకరుల సమావేశంలో కేజ్రీవాల్ మాట్లాడుతూ అన్ని రాష్ట్రాల కోసం ఇటువంటి ఆర్డినెన్స్‌ను ఏ విధంగా తేవచ్చన్నది నాయకులకు వివరిస్తానన్నారు. ‘రాజ్యాంగాన్ని వెంట తీసుకెళతా. ఈ ఆర్డినెన్స్ దిల్లీ ఒక్కదానికే కాదు మహారాష్ట్ర, తమిళనాడు, పంజాబ్, పశ్చిమ బెంగాల్ వంటి అన్ని రాష్ట్రాలకు వస్తుందని వివరిస్తా. విద్య, విద్యుత్ వంటి ప్రస్తుత జాబితాలోని అంశాలపై ఇటువంటి ఆర్డినెన్స్‌ను తీసుకురావచ్చు. ఈ అంశంలో తమ వైఖరి ఏమిటో స్పష్టంచేయాలని ఇతర పార్టీలు కాంగ్రెస్‌ను కోరుతాయని ఆశిద్దాం. సమావేశంలో మొదటగా ఆర్డినెన్స్‌పైనే చర్చ జరుగుతుంది’ అని కేజ్రీవాల్ అన్నారు. మే 19న ఆర్డినెన్స్‌ను కేంద్రం తీసుకొచ్చింది. అధికారుల బదిలీలు, నియామకాలను తమ పరిధిలో పెట్టుకోవాలని భావించింది. సుప్రీంకోర్టు ఉత్తర్వులను సైతం బేఖాతరు చేసింది. దీంతో ఆర్డినెన్స్‌కు వ్యతిరేక పోరాటానికి మద్దతును కూడబెట్టేందుకు బీజేపీయేతర నాయకులతో కేజ్రీవాల్ కలుస్తున్నారు.

సుస్థిర, స్వీయసమృద్ధి పర్యాటక రంగాన్ని కలిసి నిర్మిద్దాం

జీ20 సదస్సులో భారత్ పిలుపు

పనాజీ: భారతదేశం ప్రజాస్వామ్యానికి తల్లి, ఆధ్యాత్మికత నిలయమని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి నొక్కిచెప్పారు. సుస్థిరమైన, స్వీయసమృద్ధిగల పర్యాటక రంగాన్ని కలిసి ఏర్పాటు చేద్దామని అంతర్జాతీయ సమాజానికి మంగళవారం గోవా, పనాజీలో జరిగిన జీ20 పర్యాటక కార్యనిర్వాహక సంఘం (టీడబ్ల్యూజీ) నాల్గో సమావేశంలో కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. 2023లో కోవిడ్ మునుపటి స్థాయి పర్యాటకం నమోదు కానున్నదని ఆకాంక్షించారు. దేశ ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచరాలు, వారసత్వం, ఆధ్యాత్మికతను శ్లాఘించారు. 50కుపైగా శక్తిపీఠాల్లో దేవతలను ఆరాధిస్తారన్నారు. ఇస్కాన్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్, ఇషా ఫౌండేషన్, బ్రహ్మ కుమారీల ఆధ్యాత్మిక సంస్థలను ప్రస్తావిస్తూ వాటిని సందర్శించే వారు ఎక్కువని చెప్పారు. పుణ్యక్షేత్రాలను సందర్శించేందుకు చాలా మంది భారత్‌కు వస్తారని, సిక్కిజం, జైనిజంతో పాటు బౌద్ధమతం పుట్టింది భారత్‌లోనే అని చెప్పారు. అమృత్‌సర్‌లో స్వర్ణాలయాన్ని అనేక పుణ్యక్షేత్రాలకు విదేశీయులు సందర్శిస్తారన్నారు. మూడవ పర్యాటక కార్యనిర్వాహక సంఘం సదస్సులో ప్రతిపాదనలు, సానుకూల నిర్ణయాలపై తాజా సమావేశంతో పాటు తుది సమావేశంలోనూ చర్చిస్తామని కిషన్‌రెడ్డి తెలిపారు. సుస్థిర స్వీయ సమృద్ధి పర్యాటక రంగమే తమ లక్ష్యమని, 2030 సుస్థిరాభివృద్ధి లక్ష్యసాధనకు అనుగుణంగా కార్యాచరణ ఉన్నట్లు తెలిపారు. సుస్థిరమైన, స్వీయసమృద్ధి పర్యాటక రంగాన్ని ఏర్పాటు చేయడానికి తోడు పబ్లిక్-ప్రైవేట్ లెండర్ల మధ్య వ్యత్యాసాన్ని తగ్గించేందుకు కలిసి పనిచేద్దామని అంతర్జాతీయ సమాజానికి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. కాగా, జీ20 మొదటి పర్యాటక కార్యనిర్వాహక సంఘం సమావేశం గుజరాత్‌లోని రణ్ ఆఫ్ కచ్‌లో జరుగగా రెండవ సమావేశం పశ్చిమ బెంగాల్‌లోని సిలిగురి, డార్జిలింగ్‌లో, మూడవ సమావేశం జమ్ముకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో జరిగాయి.

పూణేలో 4వ జీ20 ఎడ్యుకేషన్ వర్కింగ్ గ్రూప్ సమావేశం

పూణే: భారతదేశం జీ20 ప్రెసిడెన్సీ క్రింద, నాల్గవ జీ20 ఎడ్యుకేషన్ వర్కింగ్ గ్రూప్ జూన్ 20-21 2023 తేదీల్లో పూణేలో సమావేశమవుతోంది. జీ20 ప్రెసిడెన్సీ భారత చీఫ్ కోఆర్డినేటర్, హర్షవర్ధన్ ష్రింగ్లా, ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి సంజయ్‌మూర్తి మంగళవారం సమావేశం ప్రారంభ సెషన్‌కు హాజరయ్యారు. జీ20 సభ్య దేశాలు, ఆహ్వానించబడిన దేశాలు ఓఈసీడీ, యునెస్కో, యునిసెఫ్ వంటి ప్రముఖ సంస్థల నుండి 85 మంది ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

'తీగ లాగితే డొంక కదులుతుంది'

- విశాఖలో ఎంపీ భార్య, కుమారుడి అపహరణపై అమిత్‌షాకు నారాయణ లేఖ
- కేంద్ర సంస్థలతో సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్, విశాఖలో పార్లమెంటు సభ్యుడు ఈవీవీ సత్యనారాయణ భార్య, కుమారుడు అపహరణ నేపథ్యంలో అక్కడి శాంతి భద్రతల పరిస్థితిపై దృష్టి సారించాలని కోరుతూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు సీపీఐ కార్యదర్శి కె.నారాయణ మంగళవారం లేఖ రాశారు. ఈ కేసు మిస్టరీగా ఉందని, దీనిపై కేంద్ర బృందాలతో ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని కోరారు. భూ కుంభకోణాలు, అనేక చట్ట విరుద్ధ కార్యకలాపాలపై ఆరా తీయాలని, తద్వారా కిడ్నాపింగ్ వెనుక కారణాలు, ఎంపీకి ఉన్న అండర్‌గ్రౌండ్ సంబంధాలు బహిర్గతమవుతాయని పేర్కొన్నారు. అమిత్‌షా స్వయంగా జోక్యం చేసుకొని కేసు సత్వరమే పరిష్కారమయ్యేలా చూస్తారని ఆకాంక్షిస్తున్నట్లు లేఖలో నారాయణ వెల్లడించారు.

'ఈనెల 11న విశాఖలో బహిరంగ సభకు మీరు వచ్చారు. నగరంలో అండర్‌వరల్డ్ గూండాలు, జూదగాళ్లు, భూ మాఫియా, సంఘ విద్రోహ శక్తులు పేట్రేగిపోతున్నట్లు చెప్పారు. ఇది జరిగిన మూడు రోజుల్లోనే ఎంపీ ఈవీవీ సత్యనారాయణ భార్య, కుమారుడు అపహరణకు గురయ్యారు. సత్యనారాయణ హైదరాబాద్‌లో ఉన్న సమయంలో అపహరణ జరిగింది. పార్లమెంటు సభ్యుని కుటుంబానికే రక్షణ లేకపోతే సామాన్యుల జీవితాలకు భద్రత ఏది? సత్యనారాయణ ఎంపీ మాత్రమే కాదు రియల్ ఎస్టేట్ దిగ్గజం కూడా. మంచి పలుకుపడి ఉన్న వ్యక్తి. కిడ్నాపర్‌తో కలిసి అనేక భూ కుంభకోణాలు చేశారు. ఆయన సహచరుడు ఏ విధంగా ఎంపీ భార్య, కుమారుడిని అపహరించగలడు? ఈ ఘటన అనుమానస్పదంగా ఉంది. ఎక్కడో ఏదో జరుగుతోందనిపిస్తోంది. ఎంపీ కుమారుడు పోలీసు స్టేషన్‌కు ఫోన్ చేసి నా సొంత పనిలో బిజీగా ఉండటంతో రౌడీ షీటర్ సంతకాల కోసం మూడు రోజుల

పాటు పోలీసు స్టేషన్‌కు రాలేదని చెప్పారు. దీంతో పోలీసు వ్యవస్థ అసమర్థత స్పష్టమవుతోంది. ఈ ఎంపీ అధికార వైఎస్ఆర్‌సీపీకి చెందిన వారు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు పోలీసు అధికారులు ఈ వ్యవహారాన్ని పట్టించుకోవడం లేదు. కాబట్టి వాస్తవాలను వెలికి తీయాల్సిన అవసరం ఉంది. కేంద్ర దర్యాప్తు సంస్థలతో ఉన్నత స్థాయిలో సమగ్ర విచారణ జరిపించండి. విశాఖ ముఖ్యనగరం, ప్రభుత్వ రంగ సంస్థలు, డాక్‌యార్డ్, నేవీ, విమానాశ్రయం వంటివి ఉన్నాయి కాబట్టి కేంద్ర ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని తేలిగ్గా తీసుకోరాదు. అన్ని వాస్తవాలు బహిర్గతమయ్యేలా చూడాలి. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక పోర్టు నగరమైన విశాఖలో ఈ మధ్యనే ఉషోదయ జంక్షన్‌లో రెండు హత్యలు జరిగాయి. లాండ్ మాఫియా విచ్చలవిడిగా కార్యకలాపాలు సాగిస్తోంది. ఖాళీ ప్రదేశం కనిపిస్తే కబ్జా చేస్తోంది. 2018 పోలీసు రికార్డుల ప్రకారం విశాఖలో రౌడీ షీటర్ల సంఖ్య 180 కాగా ప్రస్తుతం 400కుపైగా ఉంది. మా పార్టీ శాఖ అధ్వర్యంలో ఆందోళన నిర్వహించి మెమోరాండాన్ని సంబంధిత అధికారులకిచ్చింది. విశాఖ నగరంలో గూండాగిరి కట్టడికి పటిష్ట చర్యలకు పార్టీ శాఖ డిమాండ్ చేసినట్లు మీ దృష్టికి తెస్తున్నా. చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపేందుకు విశాఖ పోలీసు అధికారులు మా పార్టీ పూర్తిగా మద్దతిస్తుంది. ఏదిఏమైనా సత్యనారాయణ భార్య, కుమారుడు అపహరణ వ్యవహారం తీగ లాగితే డొంక కదిలిన చందంగా ఉంటుందని అనుమానిస్తున్నా. సమగ్ర విచారణలో అనేక విషయాలు వెలుగుచూసే అవకాశం ఉంది. కాబట్టి మరింత జాప్యం చేయకుండా కేంద్ర దర్యాప్తు సంస్థలతో ఉన్నత స్థాయిలో విచారణ జరిపించండి. దీనిపై మీ సానుకూల స్పందనను ఆకాంక్షిస్తున్నా' అని లేఖలో నారాయణ పేర్కొన్నారు.

శాంతి స్థాపనకు వారు చేసిందేమిటి?

- గీతా ప్రెస్‌కు గాంధీ శాంతి బహుమతా!
- పీఎం మోదీకి సీపీఐ ఎంపీ సంతోష్ కుమార్ లేఖ

న్యూఢిల్లీ: గీతా ప్రెస్‌కు గాంధీ శాంతి బహుమతి ప్రకటించడంపై సీపీఐ రాజ్యసభ సభ్యులు సంతోష్ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మహాత్మాగాంధీ హత్య కేసులో గీతాప్రెస్ వ్యవస్థాపకుడిని కూడా పోలీసులు అరెస్టు చేసిన విషయాన్ని ఆయన ప్రధానమంత్రి నరేంద్రమోదీ దృష్టికి తీసుకువచ్చారు. మహాత్మా గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా గీతా ప్రెస్ దేశంలో శాంతిస్థాపనకోసం చేసిన కృషి ఏమిటో కనీసం ఒక్కటైనా చెప్పాలని ప్రధానమంత్రిని నిలదీశారు. ఈ మేరకు నరేంద్ర మోదీకి సంతోష్ కుమార్ ఒక లేఖ రాశారు. గాంధీజీ హత్య జరిగితే ఆ హత్యను ఖండిస్తూ గీతాప్రెస్ అధినేత లేదా బాధ్యులు ఒక్క వ్యాసం కూడా పత్రికల్లో రాయలేదని, హత్యకు పాల్పడిన వారిని సమర్థించారని గుర్తుచేశారు. గీతాప్రెస్ చేసిన గాంధీ వ్యతిరేక చర్యల గురించి చరిత్రలో కావలసినన్ని ఆధారాలు ఉన్నాయని ఆ లేఖలో సీపీఐ ఎంపీ పేర్కొన్నారు. గాంధీజీ శాంతిస్థాపన ఆశయాలు నెరవేర్చేందుకు గీతాప్రెస్ ఏం చేసిందో చెప్పాలని ప్రశ్నించారు.

'గీతా ప్రెస్‌కు గాంధీజీ శాంతి బహుమతి ప్రకటిస్తూ మీరు తీసుకున్న నిర్ణయాన్ని నేను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాను. ఈ నిర్ణయం ఇప్పటికీ సహింపరానిది, సమ్మతింపరానిది. ఈ నిర్ణయం ఒక అనైతిక చర్య, గాంధీజీ తన జీవితాంతం ఏ ఆశయాల కోసం కట్టుబడి ఉన్నారో ఆ ఆశయాలు, విలువలపై చేసిన ప్రత్యక్ష దాడి తప్ప ఈ నిర్ణయం మరో చర్య కాబోదు, ప్రతిష్ఠాత్మకమైన ఈ శాంతి బహుమతిని గీతా ప్రెస్‌కు ఇవ్వడాన్ని పునఃపరిశీలించాలని కోరుతున్నాను' అని ఆ లేఖలో సంతోష్ కుమార్ పేర్కొన్నారు. "ఒక భారత పౌరుడుగా అత్యున్నత చట్టసభలో ప్రతినిధిగా నా మనసులోని ఆవేదన, అసంతృప్తిని వ్యక్తం చేయడం కోసం, అవార్డు ప్రకటనపై మీరు తీసుకున్న నిర్ణయాన్ని పునరాలోచించాలని కోరుతున్నాను, గీతా ప్రెస్‌కు గాంధీజీ శాంతి బహుమతి ప్రకటించడం ఖచ్చితంగా ఈ బహుమతి స్థాపనకు ఉద్దేశించిన మౌలిక లక్ష్యాలను ఉల్లంఘించడమే, గాంధీజీ సిద్ధాంతాలు, గీతాప్రెస్ సిద్ధాంతాలు పూర్తిగా విరుద్ధమైనవి, మహాత్మాగాంధీ దేశంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ పరివర్తన సాధనకోసం అహింసా సిద్ధాంతం ద్వారా జీవితకాలం కృషి చేశారు, అందుకు విరుద్ధమైన వ్యవస్థకు, వ్యక్తులను గుర్తించి మీరు ఈ అవార్డు ప్రకటించారు, మీ నిర్ణయం మహాత్మాగాంధీ రాజకీయ వారసత్వానికి తీరని, తీవ్ర అన్యాయం, అవమానం కలిగిస్తుంది. 1923లో గీతా ప్రెస్‌ను స్థాపించినప్పటి నుంచి సంస్థ సమరశీల హిందూ జాతీయవాద సిద్ధాంతాలను దేశంలో వ్యాప్తి చేయడం కోసం మాత్రమే కృషి చేస్తూ వచ్చింది, ఆ రకమైన పుస్తకాల ముద్రణ ద్వారా, పత్రికల ద్వారా, ఇతర ప్రచురణల ద్వారా ఆ సిద్ధాంత భావజాలాన్ని వ్యాప్తి చేస్తున్నది, మహాత్మాగాంధీ చేసిన ఉద్యమాన్ని బహిరంగంగా విమర్శించింది, అంటరానితనం నిర్మూలన కోసం గాంధీజీ చేసిన సేవలను విమర్శించింది, మతాల మధ్య సామరస్యత సాధనకోసం, సోదర భావం, మతసహనం పెంపొందించేందుకు ఆయన చేసిన కృషిని బాహాటంగా గీతాప్రెస్ వ్యతిరేకించింది, గాంధీజీ చెప్పిన సూత్రాలు, మార్గదర్శకాలపై శత్రుత్వాన్ని ప్రతిబింబించే ఆధారాలు చరిత్రలో కావసినన్ని ఉన్నాయి" అని ప్రధానమంత్రికి రాసిన లేఖలో సంతోష్ కుమార్ పేర్కొన్నారు.

ఏపీ దాణా పథకం భేష్: కేరళ బృందం ప్రశంస

విశాలాంధ్ర-విజయవాడ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాయితీపై పశుపోషకులకు అందిస్తున్న సంపూర్ణ దాణా పథకం బాగుందని కేరళ రాష్ట్ర పశుసంవర్థ శాఖ మంత్రి జే.చించురాణి ప్రశంసించారు. ఆమె నేతృత్వంలోని 10 మంది కేరళ శాసనసభ్యులతో కూడిన అధికారుల బృందం ఏపీలో పర్యటించింది. పశుదాణా చట్టం-2020 అమలుపై అధ్యయనం చేసింది. మంగళవారం నెల్లూరు జిల్లా తోటపల్లి గూడూరు మండలం, కోడూరు బీచ్ రోడ్డులోని పశు దాణామృత ఫ్యాక్టరీని సందర్శించి యంత్రాల పనితీరు, వినియోగం, అందిస్తున్న రాయితీ గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏపీ పశుసంవర్థశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుతో సమావేశమయ్యారు. ఏపీ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు, డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్యశ్రీ-1962, రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తున్న వివిధ సేవలు, ఇన్‌పుట్స్ గురించి అప్పలరాజు కేరళ బృందానికి వివరించారు. పశుసంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ ఆర్.అమరేంద్రకుమార్ పశుదాణ చట్టం గూర్చి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. పశుసంవర్ధక శాఖ సిబ్బందికి అవగాహన కల్పించటం, చట్టాన్ని ఏ విధంగా అమలు చేయాలో తెలియజేశారు. బృంద సభ్యుల సందేహాలను నివృత్తి చేశారు. కేరళ బృందంతో పాటు ఆరోగ్యశాఖ అదనపు సంచాలకులు డాక్టర్ పి.సత్యకుమారి, ప్రణాళికా విభాగం అదనపు సంచాలకులు డాక్టర్ ఎస్.వెంకటరావు, పశుసంవర్ధక శాఖ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

అంతర్జాతీయ సవాళ్లను

అమెరికాతో కలిసి ఎదుర్కొంటాం

- భారత్‌కు ప్రపంచంలో విస్తృత పాత్ర ఉండాలి
- 'ది వాల్ స్ట్రీట్' ఇంటర్వ్యూలో మోదీ

న్యూఢిల్లీ: అంతర్జాతీయ సవాళ్లను కలిసి ఎదుర్కొంటామని ప్రధాని మోదీ అన్నారు. తమ దేశానికి రావాలని ప్రత్యేక ఆహ్వానం ఇవ్వడం అమెరికా-భారత్ భాగస్వామ్య ప్రాధాన్యతకు ప్రతిబింబమని తెలిపారు. భారత్-అమెరికా భాగస్వామ్యాన్ని మరింత పెంచుకోవడానికి తన ఈ పర్యటన దోహదమవుతుందని ఆకాంక్షించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని న్యూయార్క్‌లో ఐరాస కేంద్ర కార్యాలయంలో అంతర్జాతీయ సమాజంతో కలిసి నిర్వహిస్తామన్నారు. వాషింగ్టన్‌కు వెళ్లి ఆ దేశాధ్యక్షుడు బైడెన్‌ను కలుస్తానని, 2021 సెప్టెంబరు నుంచి తామిద్దరం అనేక సందర్భాల్లో కలిసినట్లు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో భారత్‌కు మరింత విస్తృత, లోతైన, ఉన్నత స్థానం, పాత్ర ఉండాలని చెప్పారు. తన అమెరికా పర్యటన క్రమంలో మోదీ ' ది వాల్ స్ట్రీట్ జర్నల్'కు ఇంటర్వ్యూ ఇచ్చారు. గతంలో కంటే తమ రెండు దేశాల మధ్య సంబంధాలు మరింత బలంగా ఉన్నట్లు చెప్పారు. ప్రపంచ భౌగోళిక రాజకీయాల్లో విస్తృత పాత్ర పోషించేందుకు భారత్ అర్హమైనదని అన్నారు. విద్య, మౌలిక సదుపాయాల్లో భారత్ విస్తృత పెట్టుబడులు పెడుతోందని, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల పరిస్థితుల్లో తయారీ, సరఫరా గొలుసును పెంపొందించేందుకు బహుళజాతి సంస్థలు మన దేశం వైపు చూస్తున్నాయని మోదీ తెలిపారు. ఏ దేశ స్థానాన్నీ భర్తీ చేయాలనుకోవడం లేదని సరైన స్థానాన్ని దక్కించుకోవాలని కోరుకుంటున్నామని మోదీ అన్నారు. భారత్, చైనా సంబంధాలను ప్రస్తావించారు. తమ ద్వైపాక్షిక బంధానికి సరిహద్దుల్లో శాంతి ముఖ్యమని, సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రత, వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవడంపై విశ్వాసం ఉందన్నారు. తామెప్పుడు శాంతి పక్షమేనని ఉక్రెయిన్, రష్యా యుద్ధాన్ని ఉద్దేశించి మోదీ అన్నారు. దేశాల సార్వభౌమత్వాన్ని, అంతర్జాతీయ చట్టాలను ప్రతి దేశం గౌరవించాలని, దౌత్యమార్గాలు, చర్చల ద్వారా వివాదాలను పరిష్కరించుకోవాలని మోదీ అభిప్రాయపడ్డారు. ఐరాస వంటి అంతర్జాతీయ వ్యవస్థల్లో మార్పులు జరగాల్సి అవసరం ఎంతైనా ఉందని ఆయన నొక్కిచెప్పారు.

గవర్నర్ స్థానంలో

రాష్ట్ర వర్సిటీలకు ఛాన్సలర్‌గా సీఎం

బిల్లు ఆమోదించిన పంజాబ్ అసెంబ్లీ

చండీఘర్: రాష్ట్ర ప్రభుత్వ అధ్వర్యంలోని విశ్వవిద్యాలయాలకు గవర్నర్ స్థానంలో ముఖ్యమంత్రిని ఛాన్సలర్‌గా నియమించే బిల్లును పంజాబ్ అసెంబ్లీ మంగళవారం ఆమోదించింది. పంజాబ్ విశ్వ విద్యాలయాల చట్టాల (సవరణ) బిల్లు-2023 స్వల్ప చర్చ తర్వాత ఆమోదం పొందింది. అధికార ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తో పాటు శిరోమణి అకాలీదళ్ (ఎస్ఏడీ), బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) ఒక్క సభ్యుడు కూడా దీనికి మద్దతు పలికారు. వైస్ ఛాన్సలర్ పదవికి రాష్ట్ర ప్రభుత్వం చేసిన కొన్ని ఎంపికలతో సహా గతంలో అనేక అంశాలపై ముఖ్యమంత్రి భగవంత్ మాన్, గవర్నర్ బన్వరీలాల్ పురోహిత్ మధ్య విభేదాల మధ్య ఆప్ ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది. రెండు రోజుల పంజాబ్ అసెంబ్లీ సమావేశాలు సోమవారం ఇక్కడ ప్రారంభమయ్యాయి. బిల్లుపై చర్చ సందర్భంగా మాన్ మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ కూడా గత ఏడాది ఇదే బిల్లును ఆమోదించింది. 'మేము ఒక విశ్వవిద్యాలయానికి వీసీని నియమించలేకపోతే, అది ప్రజలు మాకు ఇచ్చిన 'ఫత్వా' (ఆదేశం) 'నిరాధార్' (అగౌరవం)' అని మాన్ సభలో అన్నారు. గత ఏడాది కొంతమంది వైస్ ఛాన్సలర్ల నియామకంలో పురోహిత్ అడ్డంకులు సృష్టించారని ఆయన పేర్కొన్నారు. మధ్యాహ్నం ఈ బిల్లును ప్రవేశపెట్టడానికి ముందు, ప్రస్తుత సెషన్‌లో ప్రశ్నోత్తరాల సమయం లేదా జీరో అవర్‌ను ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ సభ్యులు పంజాబ్ అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు. రాష్ట్రంలోని ఆప్ ప్రభుత్వం తన సొంత అజెండాను ముందుకు తీసుకెళ్లేందుకు రెండు రోజుల ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తోందని, సభా కార్యకలాపాలకు దూరంగా ఉన్నట్లు ప్రకటిస్తూ పన్ను చెల్లింపుదారుల సొమ్మును వృథా చేస్తోందని బీజేపీ సోమవారం పేర్కొంది. బిల్లు ప్రకారం, రాష్ట్రంలో ఉన్నత విద్య నాణ్యతను పెంపొందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్య, సాంకేతిక విద్య, పారిశ్రామిక శిక్షణ, వైద్య విద్య, పరిశోధన, వ్యవసాయం, పశుసంవర్ధక, క్రీడలు, యువజన సేవల శాఖల పరిపాలనా నియంత్రణలో 13 రాష్ట్ర విశ్వవిద్యాలయాలను స్థాపించి, విలీనం చేసింది. పంజాబ్ గవర్నర్ తన పదవిని బట్టి అన్ని రాష్ట్ర విశ్వవిద్యాలయాలకు ఛాన్సలర్‌గా వ్యవహరిస్తారు. గవర్నర్ కూడా రాజ్యాంగ పదవిని కలిగి ఉంటారు. భారత రాజ్యాంగం క్రింద పొందుపరచబడిన వివిధ రాజ్యాంగ విధులను నిర్వర్తించాలి. 'భారత ప్రభుత్వం న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎం.పుంఛీ అధ్యక్షతన కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ బిల్లులోని అంశాలు, కారణాల ప్రకటనల ప్రకారం, విశ్వవిద్యాలయాల ఛాన్సలర్‌కు సంబంధించి గవర్నర్ స్థానానికి సంబంధించిన ఈ అంశాన్ని వివరించింది. 'గవర్నర్ తన రాజ్యాంగ బాధ్యతలను న్యాయంగా, నిష్పక్షపాతంగా నిర్వర్తించగలిగేలా, అతను/ఆమెకు రాజ్యాంగం కల్పించని పదవులు, అధికారాలతో భారం పడకూడదు. రాజ్యాంగం ద్వారా ఊహించని అధికారాలు, కార్యాలయాన్ని వివాదాలు లేదా బహిరంగ విమర్శలకు దారి తీయవచ్చు' అని పేర్కొంది. 'ఏ శాసనం ప్రకారం గవర్నర్‌కు సాధారణ విధులను కేటాయించరాదని కూడా కమిషన్ గమనించింది. అలాగే, 'అందువల్ల పేర్కొన్న చట్టాల ప్రయోజనాల కోసం పంజాబ్ ముఖ్యమంత్రిని, అన్ని రాష్ట్ర విశ్వ విద్యాలయాలకు ఛాన్సలర్‌గా చేయడానికి విశ్వవిద్యాలయాల నిర్మాణ చట్టాలను తదనుగుణంగా సవరించడం అవసరం, అత్యవసరంగా పరిగణించబడుతుంది' అని బిల్లు వెల్లడించింది. పంజాబ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ సత్బీర్ సింగ్ గోసల్‌ను తొలగించాలని పురోహిత్‌కు చెప్పిన కొద్ది రోజుల తర్వాత, తన ప్రభుత్వ పని తీరులో క్రమం తప్పకుండా జోక్యం చేసుకుంటున్నారని గత ఏడాది అక్టోబరులో మాన్ ఆరోపించారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిబంధనలు, ఛాన్సలర్ ఆమోదం లేకుండా ఆయన నియమితులయ్యారు. చట్ట ప్రకారమే గోసల్‌ను నియమించినట్లు ముఖ్యమంత్రి పురోహిత్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. అదే నెలలో ఫరీద్‌కోట్‌లోని బాబా ఫరీద్ వైద్య ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ పదవికి ఆప్ ప్రభుత్వం ఎంపికను ఆమోదించడానికి పురోహిత్ నిరాకరించారు. ఆ పదవికి ముగ్గురు పేర్లతో కూడిన జాబితాను పంపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

జగన్నాథ రథయాత్ర ప్రారంభం

పూరి: ఒడిశాలోని పూరి క్షేత్రంలో కొలువైన జగన్నాథుడి రథ యాత్ర మంగళవారం ప్రారంభమైంది. ఏటా ఆషాడ మాసం శుక్ల విదియ రోజున జగన్నాథుడి రథయాత్ర ప్రారంభమై ఏకాదశి వరకు కొనసాగుతుంది. జగన్నాథ రథయాత్రలో పాల్గొనడానికి దేశ విదేశాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు ఇక్కడికి చేరుకుంటున్నారు. రథయాత్ర నేపథ్యంలో పూరీ నగరం జన సంద్రంగా మారింది. భక్తుల కోలాహలం మధ్య ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆనవాయితీ ప్రకారం జగన్నాథుడి సోదరుడు బలభద్రుడు, సోదరి సుభద్రతో కలిసి గుండిచా మందిరానికి రథాల్లో చేరుకుంటారు. ఈ ఊరేగింపునకు నందిఘోష్ (జగన్నాథుడి రథం), తాళధ్వజ (బలభద్రుడిది), దర్పదళన్ (సుభద్ర) రథాలు సిద్ధమయ్యాయి. మరోవైపు రథయాత్ర నేపథ్యంలో ఒడిశా ప్రభుత్వం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. భక్తులు వచ్చేందుకు వీలుగా 125 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నారు. 180 దళాలతో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ సారి 10 లక్షల మంది వస్తారని అంచనా. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పీకే జెనా తెలిపారు. ఒడిశా పూరీ జగన్నాథ రథయాత్ర సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ... భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. జగన్నాథుడి ఆశీస్సులతో ప్రతి ఒక్కరి జీవితంలో ఆరోగ్యం, సుఖ సంతోషాలు నిండాలని ఆకాంక్షించారు.

ఆకట్టుకుంటున్న జగన్నాథుని సైకతశిల్పం

జగన్నాథుడి రథయాత్రను పురస్కరించుకుని ప్రముఖ సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్.. మరో అద్భుత శిల్పాన్ని పూరీ సముద్రతీరం వెంబడి తీర్చిదిద్దారు. 250 కొబ్బరికాయలతో 6 అడుగుల ఎత్తైన జగన్నాథుడు, సుభద్ర, బలభద్రుడి విగ్రహాలకు ప్రాణం పోశారు. వాటి వెనుక జగన్నాథ రథాలను ఏర్పాటు చేశారు. చరిత్రలో దాసియా బౌరి అనే భక్తుడు.. స్వామి వారికి కొబ్బరికాయలు సమర్పించుకున్న ఘట్టానికి గుర్తుగా శిల్పాన్ని తీర్చిదిద్దినట్లు సుదర్శన్ తెలిపారు.

అహ్మదాబాద్ రథయాత్రలో అపశృతి

- కుప్పకూలిన బాల్కనీ... ఒకరి మృతి
- పది మందికి గాయాలు

అహ్మదాబాద్: అహ్మదాబాద్‌లోని దరియాపూర్ ప్రాంతంలో మంగళవారం జగన్నాథ రథయాత్ర సందర్భంగా అపశ్రుతి చోటుచేసుకుంది. రథయాత్ర ముందుకు సాగుతుండగా ఓ భవంతి మూడో అంతస్తు బాల్కనీ కుప్పకూలడంతో ఒకరు మృతి చెందగా 10 మంది వరకు గాయపడ్డారు.

అహ్మదాబాద్‌లోని జగన్నాథుని 146వ రథయాత్ర ఉదయం ఎంతో అట్టహాసంగా మొదలైంది. పోలీసులు తొలిసారి 3డి మ్యాపింగ్ టెక్నాలజీ ద్వారా రథయాత్ర మార్గాన్ని పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ ఉదయమే సంప్రదాయబద్ధంగా బంగారు చీపురుతో రథాలు వెళ్లే మార్గాన్ని శుభ్రం చేశారు. అనంతరం జగన్నాథుడు, ఆయన సోదరుడు బలభద్రుడు, సోదరి సుభద్ర విగ్రహాలను రథాలపై ఉంచి యాత్రను ప్రారంభించారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సైతం తెల్లవారుజామున మంగళ హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. భారీ భద్రత, సుమారు డజను ఏనుగులు, ఒంటెలు, అలంకరించిన శకటాలతో ఊరేగింపు మొదలైంది. మతపరంగా సున్నితమైన ప్రాంతాల్లో సీఐఐఎస్ఎఫ్ బలగాలను మోహరించారు. కాగా, రథయాత్ర జరుగుతుండగా బాల్కనీ కుప్పకూలి అనేకమంది గాయపడటం, ఒక వ్యక్తి మృతి చెందడంపై కాంగ్రెస్ నేత మోద్వాడియా విచారం వ్యక్తం చేశారు. ఘటనకు నిర్లక్ష్యం కారణమైతే దానిపై నిష్పాక్షిక దర్యాప్తు జరిపించాలని అన్నారు. క్షతగాత్రులు కోలుకోవాలని అభిలషించారు.

సాత్విక్-చిరాక్ జోడీకి నం.3 ర్యాంక్

న్యూఢిల్లీ: భారత బ్యాడ్మింటన్ డబుల్స్ జోడీ సాత్విక్‌సాయిరాజ్ రింకిరెడ్డి, చిరాగ్ శెట్టి తమ కెరీర్‌లోనే ఉత్తమ ర్యాంక్‌నుసాధించారు. రెండు రోజుల క్రితం తొలి సూపర్ 1000 పురుషుల టైటిల్ నెగ్గిన ఈ జంట ప్రపంచ 3వ ర్యాంకుకు ఎగబాకారు. వరల్డ్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ మంగళవారం డబుల్స్ ర్యాంకింగ్స్ ప్రకటించింది. గత ఏడాది కాలంగా నిలకడగా రాణిస్తున్న చిరాగ్-సాత్విక్ మూడో ర్యాంకులో నిలిచారు. ఇండోనేసియాకు చెందిన ఆర్డియాంటో, అల్ఫియాన్ ద్వయం అగ్రస్థానం దక్కించు కున్నారు. చైనా డబుల్స్ క్రీడాకారులు లియాంగ్, వాంగ్ రెండో రెండో ర్యాంక్ సాధించారు. పురుషుల సింగిల్స్‌లో భారత క్రీడాకారుడు కిదాంబి శ్రీకాంత్ మూడు ర్యాంకులు మెరుగుపరచుకొని టాప్-20లోకి వచ్చాడు. చిరాగ్-సాత్విక్ డబుల్స్‌లో గత ఏడాది నుంచి అత్యుత్తమంగా ఆడుతున్నారు. 2023లో ఈ జోడీ టైటిళ్ల వేట కొనసాగిస్తున్నారు. జూన్ 18న (ఆదివారం) జరిగిన ఇండోనేసియా ఓపెన్ డబుల్స్ ఫైనల్లో చాంపియన్స్ ఆరోన్ చియా, సోహ్ వూహి ఇకీపై సంచలన విజయం సాధించారు. వరుస సెట్లలో 21-17, 21-18 తేడాతో చిత్తు చేశారు. దాంతో తొలిసారి సూపర్ 1000 టైటిల్ చాంపియన్లుగా నిలిచిన భారత షట్లర్లుగా రికార్డు సృష్టించారు. అంతకు ముందు వీళ్లిద్దరూ స్విస్ ఓపెన్ టైటిల్ నిలబెట్టుకు న్నారు. ఈ జోడీ కామన్‌వెల్త్ క్రీడల్లో స్వర్ణ పతకం గెలిచిన సంగతి విదితమే.

సెహ్వాగ్‌ను అధిగమించిన వార్నర్

లండన్: ఆస్ట్రేలియా ఓపెనర్ డేవిడ్ వార్నర్ అరుదైన రికార్డును సాధించాడు. టెస్టుల్లో ఓపెనర్‌గా అత్యధిక పరుగులు చేసిన ఐదో ఆటగాడిగా నిలిచాడు.యాషెస్ సిరీస్‌లో భాగంగా ఇంగ్లాం డ్‌తో జరుగుతున్న మొదటి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో 57 బంతులు ఎదుర్కొ న్న వార్నర్(36) పరుగులు చేసి ఔటయ్యాడు. ఈ క్రమంలో భారత మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ రికార్డును వార్నర్ అధిగమించాడు. ఇప్పటివరకు 105 టెస్టులు ఆడిన అతడు.. ఓపెనర్‌గా 45.60 సగటుతో 8,208 పరుగులను తన ఖాతాలో వేసుకున్నాడు. ఇందులో 25 సెంచరీలు ఉన్నాయి. ఫలితంగా టెస్టుల్లో ఓపెనర్‌గా ఎక్కువ పరుగులు చేసిన టాప్-5లో జాబితాలో ప్రవేశించాడు. ఎంట్రీ ఇచ్చా డు. ఈ జాబితాలో సెహ్వాగ్ 99 మ్యాచ్లో 50.04 సగటు, 8,207 పరుగులతో ఐదో స్థానంలో ఉండేవాడు. ఇందులో 22 శతకాలు, 30 అర్ధ శతకాలు ఉన్నాయి. అయితే ఇప్పుడు ఆసీస్ ఓపెనర్ వార్నర్... సెహ్వాగ్‌ను వెనక్కినెట్టి ఈ ఘనత సాధించాడు. టెస్టుల్లో ఓపెనర్గా ఎక్కువ పరుగులు చేసిన జాబితాలో ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ కుక్... కుక్ 44.86 సగటుతో 11,845 పరుగులతో అగ్రస్థానంలో ఉన్నా డు. భారత మాజీ ఆటగాడు సునీల్ గవాస్కర్ 50.29 సగటు, 9,607 పరుగులతో రెండో స్థానంలో కొనసాగుతున్నా డు. దక్షిణాఫ్రికా మాజీ సారథి గ్రేమ్ స్మిత్ 9,030 పరుగులతో మూడో స్థానంలో నిలిచాడు. ఆసీస్ మాజీ ఆటగాడు మథ్యూ హేడెన్ 8,625 పరుగులతో నాలుగో స్థానంలో కొనసాగుతున్నాడు.

ఎంబాపే సరికొత్త రికార్డు

ప్యారిస్: ఫ్రాన్స్ ఫుట్‌బాల్ స్టార్ కైలియన్ ఎంబాపే సరికొత్త రికార్డు సాధించాడు. ఒకే సీజన్‌లో ఫ్రాన్స్ తరపున అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా నిలి చాడు. అంతేకాదు, ఈసారి పీఎస్‌జీ క్లబ్ తరఫున కూడా టాప్ గోల్ స్కోరర్ అతనే. దాంతో, 65 ఏళ్ల రికార్డు బద్దలు కొట్టాడు. ఈ సీజన్‌లో ఎంబాపే ఏకంగా... 54 గోల్స్ సాధించాడు. యూరో 2024 క్వాలిఫయర్స్ మ్యాచ్‌లో ఈ ఫీట్ సాధించాడు. గ్రీస్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ యంగ్‌స్టర్ 55వ నిమిషంలో పెనాల్టీ కార్నర్‌ను గోల్ పోస్ట్‌లోకి పంపి 54వ గోల్ ఖాతాలో వేసుకున్నాడు. గతంలో ఈ రికార్డు దివంగత స్ట్రైకర్ జస్ట్ ఫొంటేన్ పేరు మీద ఉంది. అతను 1957-58లో ఒకే సీజన్‌లో 53 గోల్స్ చేసి రికార్డు నెలకొల్పాడు. నిరుడు ఖతర్‌లో జరిగిన ప్రపంచకప్ ఫైనల్లో ఎంబాపే సంచలన ప్రదర్శన చేశాడు. హ్యాట్రిక్ గోల్స్ కొట్టి ఫ్రాన్స్‌ను గెలిపించినంత పనిచేశాడు. అయితే.. షూటౌట్‌లో 4-2తో గెలిచిన అర్జెంటీనా ప్రపంచకప్‌ను ఎగరేసుకుపోయింది. టోర్నీలో అత్యధికంగా 8 గోల్స్ కొట్టిన ఎంబాపేకు గోల్డెన్ బూట్ అవార్డు దక్కిన సంగతి తెలిసిందే.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.